RNI APTEL/2006/17980 Postal Regd.No. VSP-142/07-09

★ యేసుక్రీస్తు అందరికి ప్రభువు

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

CHRISTAVANAADU
Telugu Fortnightly
e-mail: christavanaadu1@yahoo.co.in
Head Office : D.No. 3-178, 5th Lane, ADARSH NAGAR, VISAKHAPATNAM-530 040
RNI APTEL /2006/17980

Published from VISAKHAPATNAM | సంపుటి : 3 | సంచిక : 20 | ఎడిటర్ : వై. కనకరాజు | 2009 జూన్ 16-30 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

★ రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము.

★ ఈమాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు.




దేవుని వారలకు! దైవ సృష్టిలో నరులదో ప్రత్యేకత. కోట్ల జీవరాశుల సమ్మేళనమే సృష్టి. దేని ప్రత్యేకత దానిదే. ఒకదానికొకటి పొంతన లేనట్లే కన్పిస్తుంటాయి కాని అన్నీ కలిసే జీవిస్తాయి. ఒకదాన్నొకటి కరచుకొని భక్షిస్తుంటాయి. కాని సృష్టిలో వాటి ఉనికికి ఏ ఢోకాలేదు. వాటికేదైనా అపకారం సంభవించి సృష్టిలో ఏకంగా అవి లేకుండానే పోవలసివస్తే అది నరుల వల్లనే అవాలి గాని వాటంతటవే నశించిపోవు. సృష్టి యావత్తులో నరులదో ప్రత్యేకశైలి. నరులు దేవుని పోలిక, స్వరూపమని బైబిలు సాక్ష్యమిస్తుంది. దేవుడు సర్వోన్నతుడు, మహోన్నతుడు. అట్టి ఆధిక్యతలతో జన్మించిన నరులు సృష్టిని తమ అధీనంలో ఉంచుకొని పాలించగలుగుతున్నారు. సృష్టిలో ప్రతి జీవియే గాక సమస్త జీవరాశులు నరుని పాలనను అంగీకరిస్తున్నాయి. నరుడు వాటినేం చేసినా అవి ఎదురు ప్రశ్నించవు. నరుడు దేవుని కుమారుడు. ఆ నరుని నుండే స్త్రీని చేసిన దేవుడు వారిని ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దాని లోపరుచుకోమని ఆశీర్వదించినట్లు ఆదికాండంలో చదువగలం. దేవుని ఆశీర్వాదాన్ని బట్టి మొదటి నరులైన ఆదాము, హవ్వలు అన్ని విధాలా ఫలించి విస్తరించారని లేఖనాలు తెలుపుటను బట్టి గ్రహిస్తున్నాం. అలా మొదలైన నరుల ప్రస్థానం నేటికి కోటానుకోట్లుగా కన్పడుతున్నారు. ప్రస్తుతం జీవించియున్నవారి సంఖ్యే సుమారు 700 కోట్లుంటారు. ఇప్పటికి వరకు చనిపోయినవారెందరో అంచనా కూడా వేయలేం. ఇక ముందు ఈ లోక మెన్నాళ్లుంటుందో ఇంకెందరు పుడ్తారో ఎవ్వరి కెరుక? దేవునికే ఎరుక! ఏమంటారు?

ఇంతమంది నరులలో అనేక జనాంగములున్నాయి. ఒక్కో జనాంగానిది ఒక్కో ప్రత్యేకత. వారి వారి దేశ కాలమాన పరిస్థితులను బట్టివారి రంగు రూపు ఉండుట చూస్తున్నాం. అలాగే వారికి అనేక బాషలుండుట కూడా మనకు తెల్సిందే. దేశాలు, బాషలు ఎలా ఏర్పాడ్డాయని ఆలోచిస్తే జవాబు ఒకింత దొరుకుట అసాధ్యం. కాని బైబిలును చదువుతు గ్రహిస్తూ దేవున్నెరుగుతున్న వారికి దాని జవాబు సుళువుగానే తెలుస్తుంది.ఈ విషయమై బైబిలేమంటుందో చూద్దాం.

★ **మహోన్నతుడు జనములను వారి స్వాస్థ్యములను విభాగించినప్పుడు, నరజాతులను ప్రత్యేకించినపుడు....**

జనులను వారి వారికనుకూలమయ్యే ప్రాంతాల్లో దేవుడే వారిని ప్రత్యేక పరచి ఉంచారని లేఖనాన్ని బట్టి గ్రహిస్తుంటే మనకు ఇప్పుడెంతో ఆశ్చర్యంతోబాటు ఆనందం కూడా కల్గుతుంది కదా! భూమిపై ఒక్కో ప్రాంతంలో వారు ఒక్కోలా ఉంటారు. ఆయా ప్రాంతల్లో పుట్టిన, లేక పుడుతున్న వారందరూ అలాగే ఉండుట చూస్తున్నాం. ఆఫ్రికా వారొకలా, జపానువారొకలా, చైనీయులొకలా, భారతీయులొకలా ఇదంతా గమనిస్తుంటే ఎవరికైనా ఆశ్చర్యంగానే ఉంటుంది. ఇక దేశములను గూర్చి బైబిలెలా బయల్పరుస్తుందో చూద్దాం.

★ **.....వారిలో ఒకని పేరు పెలెగు, ఏలయనగా అతని దినములలో భూమి దేశములుగా విభాగింపబడెను.**

ఎప్పుడో పూర్వకాలమందు పెలెగు అనునతడు జీవించిన దినములలోనే భూమి దేశములుగా విభాగింపబడెనని బైబిలు చెప్పుట మనకెంతో ఆదరణ కాదంటారా? అవుననే అనగలం. ఇంతవరకు దేవుడే నరజాతులను ప్రత్యేకపరచినట్లును, భూమిని దేశములుగా విభాగించినట్లును లేఖనాల్లో చూసాం. ఈ విషయం ప్రపంచంలో అనేకులకు తెలియదు. ప్రశ్నిస్తే జవాబు చెప్పని వారెందరో కనబడతారు. కాని మనమైతే బైబిలును బట్టి ఆయా ప్రశ్నలకు జవాబు ఇవ్వగలం.అందుకు దేవునికి స్తోత్రం. *(వచ్చే సంచికలో...)*

**N**orth **E**ast **W**est **S**outh

## లోక్‌సభ తొలి మహిళా స్పీకర్ మీరాకుమార్



దివంగతనేత బాబు జగజ్జీవన్ రాం కుమార్తె మీరాకుమార్ లోక్‌సభ తొలి మహిళా స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై సంచలనం సృష్టించారు. యొన్న ఎంపీ ఎలక్షన్లలో గెలిచి మంత్రిగా ప్రమాణ స్వీకారం కూడా చేశారు. అంతలోనే ఆ పదవికి రాజీనామా చేసి లోక్‌సభ తొలి మహిళా స్పీకరుగా ఎన్నికైనారు. స్పీకరుగా ఆమెను సోనియా,అద్వానీలు ప్రతిపాదించారు. సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సభ గౌరవాన్ని కాపాడతానని మీరాకుమార్ స్పష్టంచేశారు. తర్వాత ప్రధాని మన్మోహన్, అద్వానీలు ఆమెకు తమ అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా కిరణ్‌కుమార్ రెడ్డి



అసెంబ్లీస్పీకర్‌గా కిరణ్ కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిరంజీవి. జె.పి. బలపర్చారు. కిరణ్‌కుమార్‌రెడ్డి గతంలో చీఫ్‌విప్‌గా నున్నప్పుడు ప్రతిపక్షమైన తెదేపా యెడల చూపిన వైఖరిని బట్టి చంద్రబాబు కొంత విభేదించారు. కానీ స్పీకరుగా తమ పార్టీనుండి పోటీగా ఎవర్నీ నిలపలేదు. అందువల్ల ఎటువంటి ఎన్నికాలే కుండానే కిరణ్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన వనితీరుపై ఎవరికీ ఎటువంటి అనుమానమక్కర్లేదని కిరణ్‌కుమార్ రెడ్డి ప్రతిపక్షాలకు భరోసా ఇచ్చారు. సభలో అందరికీ అవకాశముండేట్లు చూస్తానన్నారు. ప్రజల ఆశలు సభలో ప్రతిభంబించి ఫలించేట్లు చూస్తానని చెప్పారు. మునుపటి సభలను లైవ్‌లో చూపిన ప్రజలు వాటినింకా మరువలేదు. ఎన్నో విమర్శలకు, చర్చలకు తావిచ్చాయా చర్చలు. ఇక ముందు టి.వి.ల్లో లైవ్ ఉంటుందో ఉండదో కూడా అనుమానమేనని తెలుస్తోంది. ఉంటే మేలని అత్యధిక శాతం ప్రజలు భావిస్తున్నారు. తామెంతో నమ్మకంతో సభకు పంపిన తమ ప్రతినిధి తమ కోసం ఎలా స్పందిస్తారో చూసే అవకాశం ఉంటుంది. తద్వారా తమ నియోజక వర్గాలకు జరగబోయే మేలుల విషయమై ప్రజలు ఒక అవగాహనకు రాగలరు. అందువల్ల శాసన సభ సమావేశాలను లైవ్‌లో చూద్దామన్న ఆశే ఎక్కువమందిలో ఉంది. లైవ్ టెలికాస్ట్‌ను గూర్చి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకొంటుందో వేచి చూడాల్సిందే!

## మహిళాబిల్లుకు మోక్షం?!





దేశాధ్యక్షురాలు మహిళ, పాలించే పార్టీ అధ్యక్షురాలు మహిళ, పార్లమెంటు స్పీకరు స్థానంలో మహిళ. ఇది దేశ చరిత్రలోనే ప్రథమం. దశాబ్దంనుండి నలుగుతున్న మహిళాబిల్లుకు వీరి హయాంలోనైనా మోక్షం లభించేనా? చూడాలి మరి. రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ పార్లమెంట్‌లో ఎంపీలనుద్దేశించి ప్రసంగించిన దాంట్లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. 100 రోజుల్లోనే వస్తుందంటున్నారు ఆంధ్రా కాంగ్రెస్ ఎంపీ ఒకరు. బిల్లు ఆమోదిస్తే సభలోనే విషం త్రాగి చస్తానంటున్నారు మరొకరు. ఆయనకు విషాన్ని మనమే పంపుదామంటున్నారు ఇంకొకరు. ఇలా ఒకరిపై ఒకరు మాట్లాడితే జరిగేదేంలేదు గాని అందరూ విజ్ఞులై పరిష్కారమాలోచించాలన్నదే ప్రజా మాట. ముగ్గురు మహిళలు ఉన్నత స్థానంలోనున్న ఈ సమయమే మహిళాబిల్లుకు అనుకూలమని భావిస్తున్నారు. మహిళలకు అన్నివిధాలా న్యాయం చేకూరి హక్కులు సంపూర్ణంగా పొందేట్లు బిల్లును గూర్చి చర్చించి లోటుపాట్లుంటే సవరించాలన్నవారు ఉన్నారు. అందరికీ అంగీకారయోగ్యంగా పటిష్టంగా రూపొందించి ఆమోదించాలన్నదే ఎక్కువశాతం వారి అభిప్రాయం. 100 రోజుల్లోనే అంటున్నారుగా! చూద్దాం.




శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబు గార్కి (B.Sc.,Ag.)
ఎమ్.ఎల్.ఏ., విశాఖ తూర్పు నియోజకవర్గం
జన్మదిన శుభాకాంక్షలు
(22-6-09)
- క్రైస్తవనాడు స్టాఫ్ 3-178, 5వ లైను, ఆదర్శనగర్, విశాఖ-40

క్రైస్తవనాడు 4వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక రాబోతుంది. దానికోసం ప్రార్థించండి. పాలిభాగస్థులై సహకరించండి.

★ సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరం

# ప్రమాణస్వీకారానికి ముందే లోకాన్ని వీడిన టెక్కలి ఎం.ఎల్.ఎ.



డా॥ రేవతీపతి
టెక్కలి ఎమ్.ఎల్.ఎ.

డా. రేవతీపతి. విశాఖ కేర్ ఆసుపత్రిలో మరణించారు. హృద్రోగ నిపుణులెంత ప్రయత్నించినా ఆయన్ని కాపాడలేకపోయారు. వైద్యుల ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఒక దశలో పర్వాలేదనే వైద్యులు చెప్పారు. అయినా... అంతలోనే ఆయన మరణిచారని విని నమ్మలేకున్నామని బంధువులు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. డాక్టరుగా ఆయన అనేకమందికి తన సేవలందించారని ఆయన సేవలు మరువలేనివని పరిసర ప్రాంతీయులు అంటున్నారు . క్రాంగెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీనివాస్ తన రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా టెక్కలి వెళ్లి ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. శాసన సభలో చిరంజీవైతే ఆయన కుటుంబంలో ఒకరిని నిలబెడితే తమ తరఫున ఎవరు పోటిలో ఉండరని భరోసా ఇచ్చారు.

**★ తనకు సంభవింపబోవునది యొకడెట్లు తెలిసికొనగలడు.**

# చిన్నారుల సేవలో సచిన్



సచిన్ టెండూల్కర్ ఆటలోనే కాదు సమాజసేవలోనూ పాలుపంచుకొంటున్నారు. అదీ చిన్నారులను చదివించుటయేగాక మరికొందరి బాగోగులు చూచుటలోనూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఓ స్వచ్ఛంద సంస్థలోని 200 మంది చిన్నారులకు చదువు చెప్పించాలని నిర్ణయించుకొన్నారట. ఇప్పటికే అదే సంస్థకు చెందిన మరో 200 మంది బాగోగులూ తనే చూస్తున్నాడట! తనలా చేయుటకు స్పూర్తి తన తండ్రేనని చెప్పారు. చిన్నప్పటినుండి తండ్రిచేసే సామాజిక సేవను గమనించుటే తనకు స్పూర్తిగా నిలచిందన్నారు. తన తండ్రి ప్రొఫెసర్‌గా నున్నపుడే పేపరుబాయ్ చదువుకు ధనసహకారమందించారని చెప్పారు. తమ ఇంటికి ఎవరొచ్చినా తండ్రే స్వయంగా టీ అందించేవారని చెప్పారు. అందులో ఎటువంటి హెచ్చుతగ్గులు తమ తండ్రి చూచేవారుకాదన్నారు. అటువంటివెన్నో సంఘటనలు తనను సామాజిక సేవపట్ల నడిపించాయన్నారు లిటిల్ మాస్టర్. ఇవన్నీ తన తండ్రి వలనే నేర్చుకున్నానని సంతోషంగా చెప్పారు సచిన్. ఇది చదివిన మనకు బైబిల్లో ప్రభువైన యేసు చెప్పిన వాక్యం గుర్తుకు రావాలి. గుర్తొచ్చిందా? లేదా! అయితే చదవండి....

**★ తండ్రి ఏమి చేయుటచూచునో కుమారుడు అదే చేయును.**

కాబట్టి తల్లితండ్రులు చెప్పే వారిగానే మిగిలిపోక, సత్క్రియలు చేయువారిగా ఉండాలి. అలా చేస్తే బిడ్డల మంచి భవిష్యత్తుకు అదే మార్గమై వారిని వర్థిల్లింపజేస్తుంది. తద్వారా తల్లి దండ్రులకు కీర్తి ప్రతిష్ట లోస్తాయనుట నిర్వివాదాంశం.

**ఎందరో క్రైస్తవ మిషనరీల వలే పరిచర్య పేరున స్థలాలు కొని, బిల్డింగులు కట్టి, ధనాన్ని సచిన్ వృధాచేయట్లేదు. అప్పటికే ఉన్న సంస్థల్లో గల బిడ్డలకు ఆదరణగా నిలిచి సహకరిస్తున్న సచిన్ సేవలు ఎందరో మిషనరీల సేవలకు భిన్నంగా కన్పించట్లేదూ....!**

**క్రైస్తవనాడు 4వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక రాబోతుంది. దాని కోసం ప్రార్థించండి. పాలిభాగస్థులై సహకరించండి.**

గమనిక: క్రైస్తవనాడు లోగోలోనూ, ప్రకటన రేట్లలోను చిన్న మార్పులు చేశాము. పాఠకులు గమనించగలరు.

"క్రైస్తవనాడు" మీకు రెగ్యులర్‌గా రావట్లేదా!?
అయితే మాకు వెంటనే తెలియజేయండి

**మీరింకా చందాలు కట్టలేదా? వెంటనే పంపి క్రైస్తవనాడు మరింత విస్తరించేందుకు సహకరించండి**


**చందాలు కట్టిన వారికే క్రమంగా పంపబడుతుంది, పాఠకులిది గమనించాలి.**

# యేసయ్య ఆశీర్వాద పండుగలు



ప్రసంగిస్తున్న రెవ.డా. సుదర్శన్ జె కొమ్మనాపల్లి అనువాదకులు రెవ.తిమోథీ

ప్రముఖ టి.వి. స్పీకరు రెవ. డా. సుదర్శన్ జె. కొమనాపల్లి ముఖ్య ప్రసంగీకులుగా గాజువాకలో "మన్నామినిస్ట్రీ" ఆధ్వర్యంలో సభలు జరిగాయి. సభలను గూర్చి విపరీతమైన అడ్వర్టైజ్‌మెంట్ చేసినా అందుకు తగ్గ జనం రాలేదని చెప్పుకుంటున్నారు. స్థానిక మన్నా చర్చి కాపరి రెవ. పి. పీటర్ సభను ఆద్యంతం పర్యవేక్షించారు. బేతని స్కూల్ సిస్టర్ అనితా మేడం సభావేదికనలంకరించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రెవ. డా. ఎం.ఎ.పాల్ ఆహ్వానించబడ్డారు. వేదిక పై స్థానిక మన్నా పాస్టరు పి.పీటర్ చందాలు పట్టునపుడు పెద్దనోటు నేను వేస్తున్నాను మీరు వేయాలి అని సభనుద్దేశించి చెప్పుటను అనేకులు తప్పుపట్టారు. ఇటువంటి ప్రకటనలు సభావేదికపై నుండి వచ్చుట ఎవరూ అంగీకరించదగినది కాదని, ఇది హర్షించదగిన పరిణామంకాదని విశ్వాసుల్లో చర్చలు సాగాయి. విశాఖపట్నంలో దేవుని వాక్యానికి ఎంతో విలువిస్తారు. ఎక్కువ శాతం కాపర్లు దేవుని వాక్యంలో బలంగానున్న వారే. దాన్ని బట్టి వారి సంఘాల్లో నున్న విశ్వాసుల్లోను వాక్యం బలంగానే ఉంటుందని సుళువుగానే ఎవరైనా గ్రహించగలరు. ఈ విషయం ఎక్కడో ఉన్న రెవ. డా. సుదర్శన్ జె కొమనాపల్లి, వారి వెంటున్న వారికి తెలియపోవచ్చు గాని స్థానికంగాఉన్న వారి చర్చికాపరికి విశ్వాసులకు తెలిసేఉండాలిగా! కనీసం వీరైనా ప్రసంగీకునికి విశాఖవాసుల వాక్య పరిజ్ఞానాన్ని గూర్చి చెప్పి ఉండాల్సిందని అనేకులు అభిప్రాయపడ్డారు. ఎందుకంటే నాటి ప్రసంగాల్లో రెవ.డా. సుదర్శన్ జె కొమనాపల్లి బోధలు విశాఖవాసులకు చప్పగా అన్పించాయి. మొదటి మూలపాఠాలుగా ఉన్నాయని అత్యధికులు నిరుత్సాహపడ్డారు. ఇంకొందరైతే ఇటువంటి సభలు లక్షలాదిరూపాయలఖర్చుతో ఎవరికోసమండీ! ఎందుకోసమండీ? అని ప్రశ్నించారు. అప్పటికే సమయం మించిపోయింది. అప్పుడు ముఖ్యప్రసంగీకులు వచ్చి తన ప్రసంగాన్ని ఇంగ్లీషులోను అనువాదకులు తెలుగులోను మొదలు పెట్టి విశ్వాసుల, కాపర్ల సహనాన్ని పరీక్షించారు. చాలా మంది వేదన చెందారు. మొత్తానికి ఇంగ్లీసు, తెలుగులో కలిపి సుమారు గంటన్నరపైనే ప్రసంగాలు సాగాయి. అందుకే కాబోలు ఇటువంటి సభలకు రాన్రాను హాజరు తగ్గుతుంది. ఐనా ఇలా లక్షాలాదిరూపాయలతో సభలు జరిపేకన్నా, సువార్త ప్రకటించబడని మారుమూల ప్రాంతాలకు సువార్త వెళ్లేలా చేయుట మేలుకదాయన్న సూచనలు సభాప్రాంగణంలో విన్పించాయి. ఈ విషయమై అందరూ ఆలోచించుట మేలని భావించారెందరో. బహిరంగసభలు అన్యులకోసమా? క్రైస్తవులకోసమా? పూర్వంలా అన్యులెక్కువ క్రైస్తవసభలకు రావట్లే. క్రైస్తవులకోసమైతే పెద్దపెద్ద పట్టణాల్లో విశ్వాసులకున్న కాపర్లే చాలు. వారిని బలపరిస్తేచాలు. లక్షలాది రూపాయలు వృధా చేయక అనేక ప్రాంతాల్లోనున్న కాపర్లను, బీదలైన విశ్వాసులను ఇటువంటి బడా ప్రసంగీకులు బలపర్చుటకు ప్రయత్నిస్తే మేలన్నదే అత్యధికుల అభిప్రాయం. ఈ విషయం ఎంతైనా ఆలోచించదగినదని అంటున్నవారే ఎక్కువ.




గ్రీటింగ్స్ & ప్రపంచ ప్రార్థనాదినం గురించి.... రెవ.డా. ఎం.ఎ.పాల్



బేతని స్కూల్ సిస్టర్ అనితా మేడం రెవ. డెవిడ్ రాయ్




## క్రైస్తవనాడు లో ప్రకటన ధరలు

| B&W | FULL PAGE | HALF PAGE | QTR. PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 4,500/- | 2,250/- |
| CENTRE PAGES | 5,000/- | 2,500/- | 1,250/- |
| REAR PAGE | 8,000/- | 4,000/- | 2,000/- |

| COLOUR | FULL PAGE | HALF PAGE | QUATER PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 9,000/- | 4,500/- |
| CENTRE PAGES | 8,000/- | 4,000/- | 2,000/- |
| REAR PAGE | 16,000/- | 8,000/- | 4,000/- |

ఫోన్స్ : 9346960601, 9490266640, 9292006116



గమనిక: మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి,భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు

★ గుర్తున్న వచానాలు పరిశుద్ధ గ్రంధమైన బైబిల్లోవి.

2009 జూన్ 1-15 సంచిక సాంకేతిక కారణాల వల్ల చేయలేకపోయాం. పాఠకులు గమనించి ఎప్పటివలే సహకరించాలని తెలియజేస్తున్నాం.

మీ చేతిలో ఉన్న క్రైస్తవనాడు పేపరు ఆసాంతం మీరు చదివారా? మీకు నచ్చిన అంశాన్ని ఫోన్, ఎస్.ఎమ్.ఎస్., ఉత్తరం... ఏదో ఒక రూపంలో తెలియజేయండి. మునుపటి పేపర్లలో ఇంకా మీకు నచ్చిన అంశాలు ఉండొచ్చు అన్న నమ్మకం కలిగి వాటిని చదవాలనిస్తే... మీ ఇంటికి పంపేందుకు మేం సిద్ధం. సంప్రదించండి, సహకరించండి, దేవుని (వాక్యం) లో బలపడండి.

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



సంపుటి : 3 సంచిక : 20 16-30 జూన్, 2009

☆ ☆ ☆

# దేవుని వాక్యమే సత్యము మన'లో' నిండాలి

సత్యము పలకాలనే అందరూ చెప్పేది. కానీ సత్యాన్ని జీర్ణించుకొనేదెందరు? ఆలోచించండి! అతి తక్కువ శాతం వారు మాత్రమే సత్యాన్ని 'గ్రహించగలరు'.వినడం వేరు. విన్నదాన్ని గ్రహించడం వేరు. విన్నవారందరు గ్రహించలేకపోవచ్చు! గ్రహించినవారు మాత్రమే తాము అంతకు ముందు విన్నది అంతవరకు సత్యమనుకొన్నది సత్యము కాదని తెలిస్తే దాన్ని విడిచిపెడ్తారు. గ్రహింపులేని వారు అలా విడిచి పెట్టలేరు. కొందరైతే ఇంతవరకు ఎలాగూ ఆచరించాంకదాని అసత్యాన్నే కొనసాగిస్తారు. మరికొందరు లోకం తమమార్పును ఎగతాళి చేయొచ్చేమో అని అసత్యంలోనే అంతకంతకు కూరుకుపోతుంటారు. సత్యమన్నది మానవుల్లోనున్న దుష్ట స్వభావాన్ని, చెడుతలంపులను బంగారాన్ని శుద్ధిచేయు అగ్నిలా కాల్చివేస్తుంది. మనిషిని మహోన్నతునిగా మారుస్తుంది. సంఘానికి ఘనంగా చూపుతుంది. సత్యం మనలోనున్న అసత్యాన్ని ప్రారంభ్రోలే ప్రక్రియలో చేదులా అన్పిస్తుంది. సత్యం కోసం నిలబడేటప్పుడు శ్రమలు ఎదురు కావచ్చు. అవి అప్పటి శ్రమలుగానే మిగుల్తాయి సత్యం వెల్లడైనప్పుడు. అసత్యం ప్రాకినంత సుళువుగా సత్యం వెళ్లకపోవచ్చు. అయినా కడకు నిలిచేది సత్యమే. తద్వారా సత్యాన్ని ప్రేమించేవారు ఘనతకు పాత్రులౌతారన్నది చరిత్రసత్యం. సత్యం నిర్భయం కల్గిస్తుంది. అసత్యం దాన్ని కాపాడుకొనుటకు అనేక అసత్యాల్ని పిల్లలుగా కంటుంది. అయినా అసత్యం సత్యం ముందు నిలువజాలదు. సత్యమన్నది వెలుగు. వెలుగును ప్రేమించేవారు బహిరంగంగానే ఆ వెలుగులో అందరికి తమ్మును తాము కనబర్చుకొంటారు. సత్యసంధులుగా లోకాన కొనియాడబడతారు. అసత్యవాదులు ఎల్లకాలం ఊహలతో బ్రతుకుతూ ఆ ఊహలే నిజాలని భ్రమిస్తూ అట్టివారిని భ్రమపరుస్తుంటారు. "తమనమ్మకాన్ని" సత్యంగా భావించి అందరిపై రుద్దడానికి ప్రయత్నిస్తూ పబ్బం గడుపుకుంటుంటారు. సత్యాన్వేషణంటేనే గిట్టని వారుగా బ్రతుకుల్ని లోకంలో అసత్యాలతో తమను తాము మోసపరచుకొంటూ తమను అనుసరించేవారందర్నీ మోసంలో పడేస్తుంటారు. అందువల్ల మనలో ఎవరైనా మనమనుసరిస్తున్నది ఎంతవరకు సత్యం? అన్న ప్రశ్న వేసుకొంటూ సత్యాన్వేషణలో సాగుతూ సత్యాన్ని మాత్రమే ఘనపర్చాలి. అసత్యాన్ని విడువగలిగే మనోధైర్యం ఉన్నప్పుడే సత్యాన్ని తెల్సుకొని గ్రహించగలరని గుర్తించుట అవశ్యం. అట్టి ధైర్యం మనకుంటే... సత్యాన్ని పొందుట, దాన్ని అనుసరించుట, అనేకుల ఎదుట నిర్భయంగా జీవించుట, మనలా ఎందర్నో మలచుట ఏమంత కష్టతరం కాదు. మనం నమ్మి అనుసరిస్తున్న సత్యమే మనచే అట్టి పనులు చేయిస్తుంది. నిత్యము సత్యము కోసం శ్రమిస్తుంటే ఒకనాటికి సత్యము మనహృదయమంతా నిండుతుంది. మన బ్రతుకు సందుతుంది అదే సత్యము యొక్క గొప్పతనం. సత్యాన్వేషకులకు ఇదే మా ఆహ్వానం!

"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తమును.........మా కొరకు ప్రార్థించుడి" (2 థెస్స 3:1)

లోకోక్తులు : ※ కృతజ్ఞత అనేది హృదయం నుంచి జనిస్తుంది. గతంలోని దయాగుణాన్ని గణించడానికి దానికి కొంత సమయం పడుతుంది.

※ హృదయ సౌందర్యంలేని శరీర సౌందర్యం వ్యర్థం -స్వామివివేకానంద

※ భక్తి ఒక్కటే ఎక్కువ దూరం తీసుకెళ్లలేదు. ఆర్తుల సేవ దానికి తోడైతేనే ముందుకు పురోగమించగలదు.

※ కాలం వృధాచేయక ఎప్పుడూ ఏదో ఉపయోగపడే పనే చేయాలి.

※ నీ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలంటే ఒకటే మార్గం; ఇష్టంలేనివి తినాలి, ఇష్టంలేనివి త్రాగాలి. ఏది వద్దనుకున్నామో అదే చెయ్యాలి.-మార్క్‌ట్వైన్

# దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం 49

బైబిల్ / దేవుని మాట × సైన్స్ / శాస్త్రజ్ఞుల మాట



సేకరణ, వివరణ: వై.ఎల్.రవిరాజు

"క్రైస్తవనాడు" ద్వారా అనేకులకు మేలు కలుగుటకై విజ్ఞాన విషయాలను అనగా నేటి వరకూ సైన్సు సాధించిన ప్రగతిని గూర్చి వివరిస్తూ, ఆ ప్రగతి అంతయు దేవుని అనంత జ్ఞానంలో కొంతమాత్రమే అని తెలియజెప్పుటకు చేయు ప్రయత్నమే ఈ "దేవునిజ్ఞానం - మానవ విజ్ఞానం" శీర్షిక ముఖ్యోద్దేశము.

**★ ఆయన వాటిని నిత్యస్థాయువులుగా స్థిరపరచి యున్నాడు; ఆయన వాటికి కట్టడ నియమించెను; ఏదియు దాని నతిక్రమించదు.**

*ఒక గ్రహానికి ముగ్గురు సూర్యులు!*

ఆశ్చర్యపోకండి! ముగ్గురు సూర్యులు కనిపించే ఆ విచిత్రమైన గ్రహం మన పాలపుంతలోనే ఉంది. హెచ్‌డీ 188753 అని మన శాస్త్రవేత్తలు పేరు పెట్టారు. దీన్ని ఈ మధ్యే గుర్తించారు. మూడు సూర్యుల్లో ఒక దాని చుట్టూ ఈ గ్రహం తిరుగుతూ ఉంటుంది. మిగతా రెండూ ఒక దాని చుట్టూ ఒకటి తిరుగుతూనే, ఆ గ్రహంతో పాటు ప్రధాన సూర్యుడి చుట్టూ తిరుగుతుంది.

*గ్రహ విశేషాలు చూద్దాం*


వాయువులతో కూడిన ఈ గ్రహం మన సౌరకుటుంబంలో ఉన్న బుధుని కన్నా సుమారు 14 శాతం పెద్దది ఉంటుందట. ఆ గ్రహం దాని సూర్యుని చుట్టూ 80 గంటలకు ఒక సారి చుట్టు చుట్టి వస్తుంది. అంటే మనకు మూడు రోజులు దాటితే ఆ గ్రహానికి ఒక్కరోజన్నమాట. మిగిలిన ఇద్దరు సూర్యులూ 156 రోజులకు ఒక సారి ఒక దాని చుట్టూ మరొకటి తిరుగుతూ.... ప్రధాన సూర్యుడి చుట్టూ సుమారు 26 సంవత్సరాలకు ఒకసారి తిరుగుతూ ఉంటుంది. ఈ గ్రహం వయస్సు మన సూర్యుని వయస్సు కన్నా సుమారు 560 కోట్ల సంవత్సరాలు ఎక్కువే! ఇది భూమికి 149 కాంతి సంవత్సరాల దూరంలో ఉంటుంది. అంటే మనం కాంతి వేగంతో ప్రయాణించే ఒక రాకెట్ మీద అక్కడకు వెళ్లి తిరిగి భూమికి వచ్చేసరికి 298 ఏళ్లు గడిచిపోతాయట! ఆశ్చర్యంగా ఉంది కదా!

*దీనిని ఎలా కనుక్కున్నారో తెలుసా....!*

అమెరికాలోని హవాయి దీవుల్లో మౌనాకియా అగ్నిపర్వతం మీద (KECK I) అనే ఓ పెద్ద టెలిస్కోపు సహాయంతో దీనిని కనిపెట్టారు.

*ఆ పేరు ఎలా వచ్చిందో చూద్దాం!....*

స్టార్‌వార్స్ సినిమా లో హీరో ల్యూక్ స్కైవాకర్ స్వ'గ్రహం' పేరు.... టాటూయిన్! ఈ గ్రహానికి కూడా ఒకటి కంటే ఎక్కువ నక్షత్రాలు ఉన్నాయట! ఈ సినిమాలో ఊహించిన విధంగానే హెచ్‌డీ 188753 గ్రహం ఉండటం వల్ల దీన్ని కనుకొన్న కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త మాసెజ్ కోనాకీ దానికి అదే పేరు పెట్టారు.



సౌర కుటుంబం ఆవల ఒకటి కంటే ఎక్కువ నక్షత్రాలున్న గుంపులు చాలా ఎక్కువగా ఉన్నాయట! వీటిల్లోనూ గ్రహాలు ఉండే అవకాశాలు ఉన్నాయని కొలానీ అంటున్నారు. అయితే ఇప్పటివరకూ మనం సౌరకుటుంబానికి ఆవల ఉన్న గ్రహాలను గుర్తించేందుకు ఉపయోగిస్తున్న పద్ధతిలో చిన్న లోపం ఉండటం వల్ల వీటిని గుర్తించ లేకపోయామని ఆయన అంచనా. సాధారణంగా సౌరకుటుంబం ఆవల ఉన్న గ్రహాల గుర్తింపునకు... ఆయా గ్రహాలు తమతమ నక్షత్రాలపై ప్రయోగించే గురుత్వాకర్షణ శక్తి ప్రభావాన్ని పరిగణలోకి తీసుకుంటారు. ఒకటికంటే ఎక్కువ నక్షత్రాలున్నప్పుడు ఈ పద్ధతి అంత ప్రభావశీలి కాదు. కొనాకీ దీనికి భిన్నంగా నక్షత్ర సమూహాల్లోని అన్ని ఖగోళ వస్తువుల వేగాలను లెక్కించడం ద్వారా అక్కడ టాటూయిన్ గ్రహం ఉన్నట్లు గుర్తించారు.

దేవుడు మనకిచ్చిన భూమికి సూర్యుడు ఒక్కడే అయినా సూర్యుని నుండి వచ్చిన వేడితాపం మనం తాళలేకపోతుంటే ఆ గ్రహానికి ముగ్గురు సూర్యులట. ఒకవేల మనం అక్కడ ఉంటే? అమ్మో భయమేస్తుంది కదూ... దేవునికి తెలుసు కాబట్టే ఆ గ్రహం భూమిని పోలివున్నా అక్కడ మనలను సృజించలేదు. మనకు ఒక్క సూర్యుడు సరిపోతాడని అనుకొని ఈ గ్రహం మీద సృష్టించారన్న గ్రహింపు మనకెంతో ఆనందాన్నివ్వాలి. ఎందుకంటే దేవుడు మంచివాడు, కృపగలవాడు. నిజంగా దేవుడు చేసిన క్రియలు ఆశ్చర్యాలు, అనంతాలు. ఈ శీర్షిక ద్వారా మనం అంతరిక్షంలోని గ్రహాల కోసం తెలుసుకుంటున్నప్పుడల్లా దేవుని మహోన్నత కార్యాలు తెల్సుకుంటున్నాం. తెల్సుకొనువారుగానే ఉండిపోక వాటిని (దేవుని కార్యాలను) ప్రకటించువారిగా ఉండాలనే ఆశిస్తున్నాం.మనం దేవునికే మహిమ తేవాలి. మనం మొదట ఆయన కోసం ఆలోచించి ఆయనకై పనిచేస్తే మన కోసం ఆయన తన క్రియలు చేసి బలపరుస్తారు. కడవరకు కాపాడుతూ ఆశీర్వదిస్తారు.

ఆర్టికల్స్ అన్నీ స్థలాభావం వలన సంక్షిప్తంగా ఉంటాయి. కాబట్టి మరింత తెలుసుకొనే ఆసక్తి గలవారు సంప్రదించండి

**★ ఇవి (విశ్వంలోనున్న నక్షత్రగ్రహ సముదాయాలు) ఆయన కార్యములలో స్వల్పములు. ఆయనను గూర్చి మనకు వినబడుచున్నది మిక్కిలి మెల్లనైన గుసగుస శబ్దముపాటిదే కదా.**

**ఆరాధన నాయకులు-నాయకుల ప్రత్యేక మూడు దినముల శక్తివంతమైన సదస్సు**

**Bro. Kripal Mohan Muppena**

**Song of Hope Ministries** ఆధ్వర్యంలో జరగనున్న

**Bridge Conference**

- ➤ Leadership Training
- ➤ Worship Leading
- ➤ Advanced Music Skills
- ➤ Workshops on All Music Instruments
- ➤ Song Writing, Film Making
- ➤ Sound Engineering

**Reg. Fee 1000/-**
**Last Day of Reg. Before 15 of July**

Speakers

Bro.Kripal Mohan Past. Damy Modi
Past. John Praveen Bro. Jubal Mohan

**Contact : Phone No. 9247318555, 9866472642**

వాయిద్యాలలో మరింత ప్రావీణ్యత కొరకు స్కిల్స్ నేర్పబడును

గమనిక : మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి గమనించగలరు.

★ ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగబోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరల రప్పించును.

ప్రార్థించండి! సహకరించండి!! క్రైస్తవనాడు మరింత విస్తరించేందుకు పెట్టుబడికై చూస్తున్నాం. అవకాశం ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
9490266640
9346960601

క్రైస్తవనాడు పాఠకులకు ప్రత్యేకం

బ్రదర్ ఎం.ఎ.పాల్ పాస్టర్ ఆధ్వర్యంలో సిస్టర్ మేరీ మార్గరెట్ తెలుగులో అనువదించిన జెకర్యాస్ టానీ ఫోమమ్ అనుభవంలో జనించిన రచన

# విజయవంతమైన ప్రార్థనకు మార్గము

**(గత సంచిక తరువాయి)**


ఆయన వారిని సమకూర్చి వారితో ఉంటాడు. వారు అడిగేటప్పుడు వారితో అడుగుతాడు. ఏమి అడగాలో ఆయనే అడిగిస్తాడు. అలా అడగాలని ప్రేరణ ఇస్తాడు. ఆ ప్రేరణ దైవచిత్తానుసారమైనది. అందుకే దేవుడు ఇంత బలంగా వారికి బద్దుడైయుంటాడు. ఆయన వారిని సమకూర్చి, ఏకమనస్సు దయచేసి వారి మధ్య బలంగా ఉంటాడు. వారికి తండ్రి చిత్తాన్ని తెలియజేస్తాడు. ఆ చిత్తాన్ని ప్రార్ధనా శక్తిగా మారుస్తాడు. వారితో కలిసి ఆశక్తిని తండ్రికి సమర్పిస్తాడు. తండ్రి కూడ వారడగినట్లే చేస్తాడు. సరియైన ప్రార్ధనకి ఇదే ఉదాహరణ. మనం అడగాలనుకున్నది దేవునితోనే ప్రారంభమౌతుంది. అడిగించేవాడు ఆయనే తన ఉద్దేశములను క్రీస్తు ద్వారా సంఘానికి తెలియజేసేది ఆయనే. సంఘము పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ముందు, దేవుని చిత్తాన్ని ప్రార్ధనలో పెడుతుంది ఆయన ఖచ్చితంగా జవాబిస్తాడు. ఇది మరోలా జరగడానికి ఆస్కారము లేదు.

## విశ్వాసి యొక్క బలము

ఆయనతో ప్రారంభమై ఆయనతో అంతమయ్యే అన్ని వ్యక్తిగత ప్రార్ధనలకు జవాబివ్వాలన్నది దైవ నిర్ణయం. యేసయ్య ఇలా చెప్పారు. - "నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును." - (యోహా 14:13,14). - "మీరు నన్ను ఏర్పరచుకొనలేదు మీరు నా పేరట తండ్రిని ఏమి అడుగుదురో అది ఆయన మీ కనుగ్రహించునట్లు, మీరు వెళ్ళి ఫలించుటకును, మీ ఫలము నిలచి యుండుటకును నేను మిమ్మును ఏర్పరుచుకొని నియమించితిని" - (యోహాను 15:16). - "అడుగుడి మీకియ్యబడును వెదకుడి మీకు దొరకును. అడుగు ప్రతివాడును పొందును వెదకు వానికి దొరకును తట్టువానికి తీయబడును" - (మత్తయి 7:7,8). -"మరియు మీరు ప్రార్ధన చేయునప్పుడు వేటిని అడుగుదురో అవి (దొరికినవని) నమ్మిన యెడల మీరు వాటన్నిటిని పొందుదురు." - (మత్తయి 21:22). -"అటువలె మీరును అడుగుడి మీకియ్యబడును. వెదకుడి మీకు దొరకును తుట్టుడి మీకు తీయబడును." -(లూకా 11:9) - "అందుచేత మీరు ప్రార్ధన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి అప్పుడు అవి మీకు కలుగును" - (మార్కు 11:24) -"నీతిమంతులు ఆశించునది వారికి దొరకును" - (సామెతలు 10:24).

"అడుగుడి" అని దేవుని వాక్యం ఎన్నిసార్లు చెప్తుందో గమనించి నేను ఆశ్చర్యపోతాను. అడగాలని దేవుని కోరిక. అడుగుట ఆయన మీద ఉన్న విశ్వాసానికి గుర్తు. అది విధేయతకూ గుర్తే. అడగని వాడు గర్విష్టి అయినా అవ్వాలి, బుద్ధిహీనుడైనా అవ్వాలి. లేక రెండూ కావాలి. చాలామంది అడగరు. ఊహిస్తారు. కొంతమంది వాంఛిస్తారు మరికొంతమంది ఆలోచిస్తారు. దీని తర్వాత అది, దాని తర్వాత ఇది అని ఆలోచిస్తు ఉంటారు. అడగడానికి ఆలోచన ప్రత్యామ్నాయం కాదు. కొంతమంది అడగటానికి బదులు అడిగితే ఎలా ఉంటుంది? అని ఆలోచిస్తారు. కాని జన్మలో మోకరించి అడగరు. అలాంటి వాళ్లకి ఎన్నడూ ఏదీ దొరకదు. దేవుని బిడ్డలందరూ అడుగుతూ, అడుగుతూ ఉండగలిగే స్థితిలోనికి రావాలి. మరో భిన్నమైన మార్గం లేదు.

దేన్నడిగినా, ఏమడిగినా ఈ మాటలు కూడ బైబిల్లో తరుచుగా మనకు కనిపిస్తాయి. అవి మనకు బోధంచేదేమిటంటే, అడగటానికి హదుద్దలులేవని ఇప్పటి కాలంలోనైనా, నిత్యత్వంలోనైనాసరే ఎప్పుడైనా అడగొచ్చు. ఆయన చిత్తాను సారముగా అడగడం ప్రారంభిస్తే గొప్ప గొప్పవి దయచేస్తాడు. ఒక మహా గని దగ్గర మనం పోగుచేసుకొనేది పైపైన దొరికేవే.



పాస్టర్ జెకర్యాస్ టానీ ఫోమమ్
14-03-2009న ప్రభువునందు నిద్రించిరి

"దేన్నయినా" "ఏమయినా" అనేవి కొంచమే అనుకుంటున్నారా? కాదు, లేదు, ఆయన ఎంత ధనవంతుడు! ఎంత గొప్పవాడు!! ఇప్పుడు ఎల్లప్పుడు ఆయన గొప్ప ఐశ్వర్యవంతుడు. అడుగుట ద్వారా మనం మహాగనిని తవ్వుతున్నాము. అపారంగా ఇవ్వగలిగే శక్తిని, అనంతమైన ఆస్థిని ఇవ్వగలిగిన ఆయన ఆశ్చర్యపోయేదీ, నిరాశ చెందేది ఎందుకో తెలుసా?

**(ఇంకావుంది)**

# వర్షాలు కురిసేందుకు... సుభిక్షంగా ఉండేందుకు.... కారణం మనం కాదా?!

**★ఏ దేశమైతే విశ్వాసఘాతుకమై నా దృష్టికి పాపము చేసినదో దానికి నేను విరోధినై ప్రాణాధారమగు ఆహారము లేకుండా జేసి కరువు పంపించి మనుష్యులను పశువులను నిర్మూలము చేయుదును**

ప్రాంతాలవారీగానేమి, రాష్ట్రాలవారీగానేమి, దేశాలవారీగానేమి అనేకచోట్ల అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టితో సతమతమౌతుండుట మనకు తెల్సిందే. ఋతుపవనాలు కదలిక లేక వర్షాలు పడలేదని ఓ కారణం చెబుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వేడిగాలులు వీస్తున్నాయని అందువల్లే వర్షాలు లేక వేడిమి ఎక్కువ అవుతుందని ఇంకోకారణం చెబుతున్నారు. ఈమధ్య మన రాష్ట్రం నిప్పులగుండంగా మారింది. వర్షాలకోసం యాగాలు, ప్రార్ధనలు చేయమని ప్రభుత్వమే ప్రకటించింది. ఓ ప్రక్క వర్షం కురిపించేందుకు మేఘమధనం కార్యక్రమం కూడా చేపడుతుంది. ఎలాగోలా వర్షాలు పడాలి, రాష్ట్రం చల్లబడాలి, పంటలు పండాలి. అదే ప్రభుత్వ ధ్యేయం. మనకైతే బైబిలు ద్వారా అతివృష్టి, అనావృష్టిలు ఏలా ఏర్పడతాయో తెలుసుకొనే అవకాశం లభిస్తుంది. మనమైనా, క్రైస్తవేతరులైనా దైవోద్దేశాలను పరీక్షించుట తప్పుకాదు. అవి హేతు బద్ధంగా అన్పిస్తే పాటించుట అందరికీ మేలే కదా! మనకైతే అవి నిత్య సత్యాలు. దేవుడు మానవులయెడల ఎటువంటి ఉద్దేశాలను కలిగున్నారో తెలుసుకొనుట ఎంత మంచి విషయమో, అది తెలియని ఇతరులకు దాన్ని తెలియజేయుట అంతకన్నా గొప్ప విషయం. క్రైస్తవులు ఇది గ్రహించాలి. లేఖనాల్లో గల దైవోద్దేశాలు వరుసగా చదవండి... గ్రహించండి... ఆచరించేందుకు ప్రయత్నించండి....

అధికారములు దేవుని వలన నియమింపబడియున్నవని మనమెరుగుదుము. మనల్ని పాలించేందుకు దేవుడే ఒకర్ని నియమించుననియు ఎరుగుదుము. అలా దేవుని వలన అధికారం కైవసం చేసుకున్న వారు దాన్ని కడవరకు నిలబెట్టుకొనేందుకు దేవోక్తులను ఆశ్రయించాలి. వాటిచొప్పున తమ పరిపాలన ఉండేట్లు చూసుకోవాలి. తమకివ్వబడిన అధికారం దేవుని కృప మాత్రమేనని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. దేవుని యెడలను, మానవులయెడలను ప్రభుత్వాన్ని నడుపుటలో వినయవిధేయతలు కనబర్చాలి. అహంకార పూరిత మాటలెన్నడూ తమ నోటరానీయకుండా నాలుకను కాచుకోవాలి. అహంకరించుటకు మానవులెంతటివారు? నిమిత్తమాత్రులే గదా!

లోకస్థులందరూ తమ దీపం ఎప్పుడు ఆరిపోతుందో ఎరుగని వారే. పదవులొచ్చినా వాటిని అనుభవించక లోకాన్ని వీడిపోయిన వారెందరో మనకు కన్పడుతుంటారు. అందువల్ల పదవిరావడం సగం ఆశీర్వాదమేనని గుర్తించాలి. సుభిక్షమైన పరిపాలనతో కడవరకూ పాలించుటే పదవికి సంబంధించిన సంపూర్ణ ఆశీర్వాదం అని గ్రహించుటే విజ్ఞుల లక్షణం. అందరినీ పరీక్షించు దేవుడున్నాడని బహుజాగ్రత్త కలిగుండాలి.

★ యెహోవా అనంత జ్ఞానియగు దేవుడు. ఆయనే క్రియలను పరీక్షించువాడు. ఇకను అంత గర్వముగా మాటలాడకుడి. గర్వపుమాటలు మీనోట రానియ్యకుడి

గర్వపుప్రవర్తనన్నా, మాటలన్నా దేవుని కిష్టంలేనివి. ఇంతవరకు ఎప్పుడైనా మాట్లాడితే మాట్లాడి ఉండొచ్చుగాక! 'ఇకను' అని వ్రాయబడిందాన్ని బట్టి అట్టి అహంకార పూరిత మాటలు నోట రాకుండా పాలకులు జాగ్రత్తపడాలి. దేవుని లేఖనాలు పాలకులే కాదుగాని అందరూ పాటించుట మరి శ్రేష్టం.

**★ తాను నియమించిన రాజుకు ఆయన బలమిచ్చును**

దేవునిచే నియమింపబడిన వారికి ఆయనే బలము. నియమింపబడినవారు దేవుని యెడల భయభక్తులతో ఉంటూ ప్రజల్ని పాలించాలి. దేవునిని మనం పరలోకపు తండ్రిగా పిలుస్తున్నాం. అలాగే పాలకులు తమచే పాలింపబడే ప్రజలకు తండ్రి ప్రేమను పంచగలగాలి. అట్టి పాలకులకు దైవాశీర్వాదాలకు లోటే ఉండదని బైబిల్లో అనేక వచనాలు భరోసా ఇస్తాయి. అందుకు ఉదాహరణగా దావీదును తన ప్రజలనేలుటకు అధిపతిగా నియమించిన దేవుడు అతనికెట్టి ఆశీర్వాదాలనిచ్చాడో చదవండి....

**★ నేను వారికి దేవుడనైయుందును, నా సేవకుడైన దావీదు వారి మధ్య అధిపతిగి ఉండును**

దావీదును తన ప్రజలనేలుటకు అధిపతిగా నియమించిన దేవుడే వారికి ఆశీర్వాదం. అలాగే నేడు ప్రతి అధిపతి కూడా తనకా అధికారం దేవుడిచ్చినదని గ్రహించాలి. దేవుని పాలన లోకంలో జరిగేట్లు వినయమనస్కుడై పాలించాలి. అట్టి పాలకులున్న ప్రతి ప్రాంతం దైవాశీర్వాదాలకు నోచుకుంటుందనుట లేఖనాన్ని బట్టి నమ్మాలి. ఆ ఆశీర్వాదాలెలా ఉంటాయో కూడా లేఖనాల్లోనే చదవండి....

★ వారిని, నా పర్వతము చుట్టుపట్ల స్థలములను దీవెనకరముగా చేయుదును. రుతువుల ప్రకారము వర్షము కురిపించెదను, దీవెన కరమగు వర్షములు కురియును. ఫలవృక్షములు ఫలములిచ్చును. భూమి పంట పండును. వారు దేశములో నిర్భయముగా నివసింతురు

చదివారుగా! ఎంత మంచి దేవుడో అన్పిస్తుందిగదా. ఆయన మనకు తండ్రి. బిడ్డల క్షేమం కోరే పరలోకపు తండ్రాయన. వర్షాలు ఎక్కువైనా, తక్కువైనా దీవెన కరంగాదు. అందుకే మనం దేవోక్తులను శ్రద్ధగా నేర్చుకొని అనుసరిస్తూ అనేకులకు తెలియబరుస్తుంటే చాలు. దేవుని కోరిక అదొక్కటే! ఆ దేవుని గూర్చియు, ఆయన కుమారుడైన యేసుక్రీస్తును గూర్చియు అనేకులకు తెలుపుటే ఆశీర్వాదం యేసు సర్వమానవాళికొరకు చేసిన బలియాగం ఎంత గొప్పదో మనం అందరికి అర్ధమయ్యేట్లు తెలియజేస్తేనే మనకు మహిమ. దేవుడు మనకా మహిమను సంపూర్ణంగా దయజేయును గాక!

**-వైకెయార్.**

క్రైస్తవనాడులో వై.కె.రాజు & వై.ఎల్. రవిరాజులచే వ్రాయబడుచున్న ఆర్టికల్స్ అన్నీ స్థలాభావం వలన సంక్షిప్తంగా ఉంటాయి. కాబట్టి మరింత తెలుసుకొనే ఆసక్తి గలవారు సంప్రదించండి

**క్రైస్తవనాడు చందాదారులకు...!**

**మీ అమ్మాయి, అబ్బాయిల వివాహ ప్రకటనలు, పెళ్లి రోజు, పుట్టిన రోజుల శుభాకాంక్షలు, ప్రభువునందు నిద్రించిన వారి జ్ఞాపకార్థ రోజు తదితర ప్రకటనలన్నీ .....**

**ఉచితం!**

**చందాదారులు కానివారికి...!**
**ఒక ప్రకటన కేవలం 50/- మాత్రమే**
(30 x 45 ఎమ్.ఎమ్.సైజ్‌లో.... )

గమనిక : మోసగాళ్లున్నారు జాగ్రత్త! క్రైస్తవనాడు వారమని మీ దగ్గరకు ఎవరొచ్చి చందాలు కట్టమన్నా ఐడెంటిటీ కార్డు చూపమనండి. తగు రసీదు అడగండి. క్రింది నెంబర్లలో దేనికైనా ఫోన్ చేయండి, అలా మనం కూడి మోసగాళ్లను అరికట్టొచ్చు! సెల్ : 9490266640, 9346960601, 9292006116.

యెహోవాయందు నమ్మకముంచువాడు వర్థిల్లును-బైబిల్

**SAHITHI CERAMICS**

**ALL WALL & FLOOR TILES**



SANITARY WARE

#48-1-22/2, Srinagar, Near Ramatalkies, Visakhapatnam-16

**Phone : 0891-6455880, Mobile : 92 91 49 18 15**



# చాకిరేవు



- ఎడిటర్

# సహాయం చేసేవాళ్లా? కోరేవాళ్లా?

## మీరేకోవకు చెందినవారో సరిచూసుకోండి!

క్రైస్తవలోకంలో అత్యధిక శాతం వారు మునుపటి రోజుల్లో నిస్వార్ధంగా ఇతరులకొరకు సమయాన్ని, ఆస్తుల్ని ఖర్చుపెట్టేవాళ్లు. తద్వారా ఆంధ్రాలోనే కాదుగానీ యావత్తు దేశంలో అధికశాతం మిషనరీ స్కూళ్ళు ఏర్పడ్డాయి. ఎందరో వాటిలో చదువుకొనే నేడు ఉన్నతాత్యున్నత స్థానాల్లో ఉన్నారనుట జగద్వితం. నేనూ అటువంటి పాఠశాలలోనే చదివాను. అయితే తర్వాతి దినాల్లో "కొన్ని కుటుంబాలవారు" క్రైస్తవం తమసొంతాస్తి అన్నట్లు ఆంధ్రాలో తమ డామినేషన్‌ను కనబర్చారు. ఇప్పటికీ కొంత వారి డామినేషన్ లేకపోలేదు. వారు వారి కుటుంస్థులే గొప్ప సేవకులన్న భావం కొందరి విశ్వాసుల్లోనూ కొంత ఉందనుట వాస్తవదూరం కాదు. ఇప్పుడిప్పుడే బైబిల్లో గల జ్ఞాన విషయాలను మర్మాలను బయల్పరచు వారు కొందరు బయల్దేరుతూ వారికి సవాలుగా పరిణమిస్తున్నారు. అయితే ఎవరైనా తమ సొంతాధిక్యతలకు తావియ్యక వారికా జ్ఞానం, దాన్ని ప్రకటించుకొనే అవకాశం తమకు దేవుడిచ్చిన భాగ్యమని గుర్తెరగాలి. అపుడే క్రైస్తవానికి ఒక అర్ధం పరమార్ధం ఉంటుందనుట అతిశయోక్తి కాదు. మనస్ఫూర్తిగా క్రీస్తును ప్రేమించు వారికి ఆస్తి తృణప్రాయంగానే కనపడుతుంది కాదంటారా?

అయితే ఈ ఉపమానం మీకోసమే... మనరాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డి గారు నా యొద్దకొచ్చి - కనకరాజూ నీకే కోటిరూపాయలివ్వాలను కుంటున్నాను తీసుకో అని ఇచ్చారనుకోండి! కోటితో నా పనులు, నాగొప్పలు ప్రదర్శించు కుంటే నాకంటే అజ్ఞాని ఇంకెవరూ లోకంలో ఉండరు. ఎందుకంటే రాష్ట్రాధినేతయే నన్నుప్రేమించి ఇచ్చుట ఒకింత ఆశ్చర్యమే. ఒకవేళ ఇస్తే దానికి కారణం నాపై ఆయనకున్న నమ్మకము. నా ద్వారా ఆయన తన సంకల్పాన్ని బట్టి ఆయన అనుకున్న పనులు నెరవేర్చు కొనుటకేనని నేను గ్రహించాలి. రాష్ట్రాధినేత కోటి రూపాయలు మాత్రమే ఇవ్వగలరా! కాదుకదా. ఎంతైనా ఇవ్వగల సమర్ధులు. ఎంతైనా ఇవ్వగలిగిన రాష్ట్రాధినేత ప్రేమాభిమానాలనే పొందగలిగిన నాకు కోటి ఓ లెక్కలోకి రాదని గ్రహిస్తేనే నేను జ్ఞానిని. ఎందుకంటే కోటి రూపాయల కంటే రాష్ట్రాధినేత గొప్పవారు. క్రీస్తులో కూడా మనమలాగే ఆలోచించుట అలవర్చు కోవాలి. అందువల్ల క్రీస్తునే ఆశిస్తే మన కడవరకు ఆయనే ఎంతైనా ఇవ్వగలరు. అది ఎట్టిదైనా ఆధిక్యతైనా అధికారమైనా మన సొంతం చేయగలరు. అది తెలిసే గాబోలు దావీదు నీవు నాకుండగా లోకములోది ఏదీ అక్కరలేదని దేవునితో పలికినట్లు లేఖనాల్లో చూడగలము. ఆ లేఖనం ఈయుగమందున్న మనకు బుద్ధికలుగుటకే దేవుడు బైబిల్లో వ్రాయించాడని గ్రహించాలి. ఆవిధంగా ఆలోచిస్తూ మన జీవితం సాగించాలి. అపుడే అపోస్తలులు చేసినట్లు సేవకోసం ఇవ్వబడినవేవైనా అవుసరత కలిగిన వారి వారి "అక్కరకొలదీ" అందరికీ సమానంగా పంచగలం. తద్వారా క్రీస్తుసేవ బహుఘనంగా జరుపగలం. ఒకనాటి మిషనరీలను గూర్చి ఇపుడు చెప్పుకుంటున్నాము. ఎందుకూ అని ఆలోచిస్తే లోకంలో అందుకెన్నో సాక్ష్యాలను వారు మిగిల్చి వెళ్ళారు. అవే వారిని గూర్చి నేడు సాక్ష్యం పలుకుతున్నాయి. మరి మన వంతుగా సాక్ష్యాలు మిగల్చాలి కదా. క్రీస్తుకొరకు మీ సాక్ష్యం (మీకొరకు కాదు) ఇప్పటికే లోకంలో ఉందా? లేకపోతే ఇప్పటినుండైనా ఉంచుటకు ప్రయత్నించండి! అదే మనకు ఆశీర్వాదం. ముందుతరం వారిని గూర్చి "క్రైస్తవేతరులు" ఎటువంటి సాక్ష్యం పలికారో మనగూర్చి కూడా ఈతరం "క్రైస్తవేతరులు" అటువంటి సాక్ష్యం పలుకగలగాలి. అపుడే క్రీస్తులో మన ఫలించినట్లు. ఆ ఫలాలు భవిష్యత్ సేవకు విత్తనాలని గ్రహించాలి. అట్టి సేవే లోకంలో మనకూ వ్యక్తిగత గుర్తింపునిస్తుందనుట అతిశయోక్తి కాదు. క్రైస్తవులంటే పెట్టేవాళ్ళే గాని తినేటోళ్ళు మాత్రం కాదని మన తరంవారు మన గురించి సాక్ష్యమివ్వాలి. ఆ సాక్ష్యం లోకంలో మారుమ్రోగాలి! ప్రతిధ్వనించాలి!! ఏమంటారు?

ఆర్టికల్స్ అన్నీ స్థలాభావం వలన సంక్షిప్తంగా ఉంటాయి. కాబట్టి మరింత తెలుసుకొనే ఆసక్తి గలవారు సంప్రదించండి


విశాఖలో... ప్రతి నెల ఆఖరి శనివారం

రెవ. డా. పి.జె. స్టీఫెన్‌పాల్ గారి

ప్రసంగాలు!

కళాభారతి ఆడిటోరియం,

మద్దిలపాలెం

సా॥ 6 గం॥ల నుండి



అందరూ ఆహ్వానితులే...



"క్రైస్తవనాడు" మీకు రెగ్యులర్‌గా రావట్లేదా!? అయితే వెంటనే మాకు తెలియజేయండి

మీరింకా చందాలు కట్టలేదా? వెంటనే పంపి సహకరించండి

చందాలు కట్టిన వారికే క్రమంగా పంపబడుతుంది, పాఠకులిది గమనించాలి.



క్రైస్తవనాడు చందాదారులకు...!

ఉచితం! మీ అమ్మాయి, అబ్బాయిల వివాహ ప్రకటనలు, పెళ్లి రోజు, పుట్టిన రోజుల శుభాకాంక్షలు, ప్రభువునందు నిద్రించిన వారి జ్ఞాపకార్థ రోజు తదితర ప్రకటనలన్నీ ..... ఉచితం!

చందాదారులు కానివారికి...!

ఒక ప్రకటన కేవలం 50/- మాత్రమే

(30 x 45 ఎమ్.ఎమ్.సైజ్‌లో.... )


## తెలుసుకుందాం!

★ జ్ఞానుల పెదవులు తెలివిని వెదజల్లును

### సైన్స్

- ❖ కాంతి కిరణం ఒక సంవత్సరకాలంలో ప్రయాణం చేసే దూరం కాంతి సంవత్సరం అని అంటారు.
- ❖ గ్రహాలన్నింటిలోకెల్లా పెద్దది గురుగ్రహం
- ❖ సూర్యునికి కనిష్ట దూరంలో ఉన్నది బుధ గ్రహం
- ❖ రెండవ అతిపెద్ద గ్రహం శని గ్రహం
- ❖ పూర్వకాలపు జీవుల గురించిన సమాచారాన్ని శిలాజాలు అందిస్తాయి.
- ❖ సూర్యకేంద్రక సిద్ధాంతం సరైనదేనని వివరించిన ప్రఖ్యాత ఖగోళ శాస్త్రజ్ఞుడు టైకో బ్రాహీ
- ❖ కాంతి ఉద్దీపన తీవ్రతను కెండెల్లాతో కొలుస్తారు
- ❖ బలానికి, వస్తువుల చలనానికి మధ్య గల సంబంధం పై అధ్యయనానికి పునాది వేసిన వాడు సర్ ఐజాక్ న్యూటన్ (17వ శతాబ్దం)
- ❖ నేలబొగ్గు అనేది శిలాజ ఇంధనం
- ❖ న్యూటన్ మొదటి గమన సూత్రం వస్తువుల ముఖ్యమైన, సహజమైన ధర్మం జఢత్వం గురించి తెలియజేస్తుంది.
- ❖ మానవ విసర్జకాలను కూడా బయోగ్యాస్‌ప్లాంట్లులో వాడవచ్చు.
- ❖ వస్తువు చలనానికి గల కారణం 'బలం'
- ❖ విమానాలు గాలిలో బెర్నౌలి సూత్రం ఆధారంగా ఎగురుతున్నాయి.
- ❖ 'కాంతి కణాల సముదాయం' న్యూటన్ ప్రతిపాదన
- ❖ మానవుని కన్ను కెమెరాను పోలి ఉంటుంది.
- ❖ భూమి ఒక పెద్ద అయాస్కాంతం.

### జి.కె.

- ❖ దేవదర్ ట్రోఫీ క్రికెట్ క్రీడకు సంబంధించింది
- ❖ అంటరానితనం హేయమైన చర్య అని రాజ్యాంగంలో 17వ ఆర్టికల్ పేర్కొంది
- ❖ క్విట్ ఇండియా ఉద్యమం 1942 ఆగస్టు 8న బొంబాయిలో ప్రారంభమైంది.
- ❖ సింధు నాగరికత ప్రజలు పశుపతిని పూజించేవారు.
- ❖ విజయనగర రాజుల కాలంలో వారి రాజ్యాన్ని సందర్శించిన ఇటలీ రాయబారి నికోలోకొంటి
- ❖ 1857 ప్రథమ స్వాతంత్ర్య కాలం నాటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డ్ కానింగ్
- ❖ రెండో పంచవర్ష ప్రణాళికను రూపొందించింది మహలనోబిస్
- ❖ పార్లమెంటు ఉభయసభలు తొలిసారిగా సంయుక్తంగా 1961లో (వరకట్న నిషేధబిల్లుకు సంబంధించి) సమావేశమయ్యాయి
- ❖ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను జాతీయం చేసిన సంవత్సరం 1949 జనవరి 1
- ❖ కాఫీ పంట ఉత్పత్తిలో దేశంలో ప్రథమస్థానంలో ఉన్న రాష్ట్రం కర్ణాటక
- ❖ మన దేశంలో రెండో పురాతన బ్యాంక్ పంజాబ్ నేషనల్ బ్యాంక్

### చరిత్ర

- ❖ క్రీ.పూ. 500 కాలంలో రోమన్‌లు తమ భూభాగం నుంచి ఎట్రస్కన్‌లను పారద్రోలారు. ఇది వారి సుదీర్ఘ సైనిక విజయాలలో మొదటిది.
- ❖ చారిత్రంగా మూడు 'ప్యూనిక్ యుద్ధాలు' జరిగాయి. మొదటి యుద్ధంలో రోమ్ గెలుపొందింది. రెండవ ప్యూనిక్ యుద్ధంలో కార్దెజియన్‌ల తరపున 'సిపియో' యుద్ధంలో పాల్గొన్నాడు. మూడవ ప్యూనిక్ యుద్ధంలో కార్దెజియన్‌లు సర్వనాశనం అయ్యారు. ఈ విజయాలన్నింటికీ నాటి రోమన్ పాలకుడు 'జూలియస్ సీజర్' ప్రధాన కారకుడు.
- ❖ రోమన్ సామ్రాజ్యం పశ్చిమ, తూర్పు భాగాలుగా విడిపోయిన తదనంతరం, క్రీ.శ. 527 నుచి 567 మధ్య కాలంలో పాలించిన 'జస్టీనియన్' ఈ రెండు ప్రాంతాలను ఒకే పరిపాలన కింద తీసుకువచ్చిన పాలకుడిగా కృతకృత్యుడయ్యాడు. అయితే క్రీ.శ. 6వ శతాబ్దం మొదట్లో అనాగరిక జాతుల దాడి కారణంగా రోమన్ సామ్రాజ్య విచ్ఛిత్తి అనివార్యమైంది.
- ❖ రోమన్‌ల ప్రాచీన నిర్మాణ కళలకు ప్రతిరూపం 'కలోసియం' నిర్మాణం. ఈ నిర్మాణం లోపల 'గ్లాడియేటర్' అనే క్రీడా యుద్ధాలు జరిగేవి. ఆకలి గొన్న క్రూరమృగాలకు, బానిసలకు మధ్య యుద్ధం చేయిస్తూ, ఆనందించే అప్పటి పాలకుల రాక్షస క్రీడే గ్లాడియేటర్.
- ❖ ప్రాచీన రోమన్ రాజులు క్రైస్తవ మతాన్ని ఒక సాధరణ మతంగా పరిగణించారే తప్ప ప్రత్యేకంగా గుర్తించలేదు. 'మార్కస్ అరిలియస్' అనే రాజు, క్రైస్తవులను హింసించడమే తన పౌరధర్మంగా ప్రకటించుకున్నాడు. క్రీ.శ.248లో రోమన్ నగర వార్షికోత్సవంలో పాల్గొనడానికి నిరాకరించిన కారణంగా వారిని ఉరి తీయించవలసిందిగా అజ్ఞాపించింది కూడా ఈయనే.

# మీ ప్రశ్న - ఎడిటర్ జవాబు

ప్రభువునందు ప్రియులకు ! అనేక ప్రాంతీయులు వారి సందేహాలు, విభిన్న ఆలోచనలవల్ల ఉత్పన్నమయ్యే అనేక సంశయాలను నాతో అనేక విధాలుగా పంచుకుంటూ జవాబు రాబట్టాలని ఆశిస్తున్నారు. వాటినే ప్రశ్నలుగా ఇస్తూ వాటికి నా జవాబులు వరుసగా మరనేకులు ఎరుగుతూ ప్రభువునందు బలపడాలని ఆశిస్తున్నాను. అందుకు నిదర్శనమే ఈ శీర్షిక. మీమీ ప్రశ్నలు కూడా సంధించండి! తగు విధంగా జవాబు పొందండి!!

**★ సరిగా ప్రత్యుత్తరమిచ్చినవానికి దాని వలన సంతోషము పుట్టును సమయోచితమైన మాట ఎంత మనోహరము.**

## సువార్తను గూర్చి ప్రశ్నావళి (సంక్షిప్తంగా)

ప్రశ్న : సువార్త చేయాలి అంటున్నారే గాని చేస్తున్నారా అన్నది అనుమానమే. దీనిపై మీ వివరణేంటి?
**జవాబు : సువార్త చేయాలి అని అనుకుంటే చేయలేరు. దానికి తగిన విధంగా స్పందిస్తూండాలి. ఆ స్పందన తమకున్న దాన్నే ప్రభువుకోసం ఖర్చు అయ్యేట్లు చేస్తుంది. ఖర్చు చెయ్యనివారు సువార్త చేయలేరు. ఖర్చంటే డబ్బు ఒక్కటే కాదని గుర్తించాలి.**

ప్రశ్న : డబ్బుకాక మరేంటి?
**జవాబు : తమకు దేవుడిచ్చిన సమయాన్ని వాక్యంలో ఎదిగేందుకు ఖర్చుచేయుట ప్రథమ సంగతి. నేర్చుకున్న వాక్యమే దేవుడు అన్న సంగతి గ్రహించాలి. ఆ దేవుని ప్రకటించాలి అన్న సంగతి హృదయంలో మండాలి. ఆ మంటే మనల్ని ముందుకి నడుపుతుంది. అలా నడిచే వారికే ఉబ్బు అవసరమొస్తుంది. అంటే డబ్బు అవసరత చివరిదన్నమాట.**

ప్రశ్న : చాలా మంది సువార్త చేయకపోవడానికి తమ దగ్గర తగినంత ధనం లేదని చెబుతుంటారు. ఆ మాటల్లో నిజమెంత?
**జవాబు : నూటికి నూరుపాళ్లూ తప్పని నా అభిప్రాయం. ఎందుకంటే సువార్తంటే యేసుని గూర్చి యేసుని ఎరుగని ఇతరులకు ప్రకటించుట. దానికి డబ్బేందుకు? బైబిలు నేర్చుకొని గ్రహించే జ్ఞానముందిగా! అది ప్రకటించుటకు నోరుందిగా! అదిచాలు. వేలాది మందికి చెబితేనే సువార్తా? యేసునెరుగని ఒకరికైనా చెప్పుట సువార్త కాదంటారా? ఆలోచించాలి. ఒక ఆత్మని రక్షిస్తేనే పరలోకంలో సంతోషమని వాక్యంలో వ్రాయబడింది.**

ప్రశ్న : చాలా మంది డబ్బునే సాకుగా చూపుతూ సువార్త చేయక, మీలా ఆలోచించరెందుకని?
**జవాబు : ఎందుకంటే.... వారు ఇతరులను చూసి తామూ వారిలా చాలా చాలా గొప్పగా సభలు పెట్టి చెప్పాలనుకుంటూ చతికిలబడిపోతుంటారు. మరి కొందరైతే ఇతరులు వాహనాలతో వెళ్లి సువార్త ప్రకటించుటను చూసి వారిలా చెద్దామని ఆశపడుతుంటారు. ఏదేమైనా ఎవరెలా సువార్త చేసినా చూసి ఆనందించాలి. వారిలానే మనమూ చేయాలని భావిస్తూ ఆయా సదుపాయాలు సమకూర్చుకొనే వరకు కాలయాపన చేయుట భావ్యం కాదు. మనకున్నంత అవకాశం మట్టుకే దేవుని గూర్చి ప్రకటిస్తూ వెళ్తుంటే చాలు. మన హృదయ యధార్థత నెరిగిన దేవుడు మన పరిచర్యను మనకున్న యధార్థతను బట్టి విస్తరిస్తుంటారు. అది ఆయన బాధ్యత. ఆయన మన యజమాని. మనల్ని కన్న పరలోకపు తండ్రి. మనము ఆయన్ను గూర్చి ఒక్కరికూనా చెబుతుంటే చూసి సంతోషించే దేవుడు ఒక్కరికి చెప్పిన మనల్నే భావి జీవితంలో అనేకులకు చెప్పే వారిని తీర్చిదిద్దగల ఆశ్చర్యకరుడాయన. ఇది నిజం. నమ్మి సువార్తికులుగా మారండి. దేవుడిచ్చిన మహిమను పొందండి.**

ప్రశ్న : అలాంటి ఉదాహరణ ఏదైనా ఇవ్వగలరా?
**జవాబు : ఎవరిదో నేనివ్వలేను. నాదే ఇస్తున్నాను చదవండి.... క్రీ.శ. 2004లో ఓ కరపత్రంతో మొదలైందే దేవుని గూర్చిన నా పరిచర్య. అది ఆయనను మహిమపర్చింది. ఆయన నన్నాదరించి మరిన్ని కరపత్రాలు వ్రాయించారు. క్రీ.శ. 2006 కే నన్ను 'క్రైస్తవనాడు' పేపరుకు ఎడిటర్‌గా మీ ముందుకు తీసుకొచ్చి ఓ పాత్రలా వాడుకుంటున్నారు. అందుకు దేవునికి స్తోత్రం. అందుకే మరలా చెబుతున్నాను... డబ్బు మనల్ని దేవుని చెంతకు చేర్చలేదు. మన ఆలోచన దేవుని కోసమై కార్యరూపం దాలిస్తే చాలు. ఆయనే మనల్ని నడుపుతూ దానికి తగినంత డబ్బును సమృద్ధిగా ఇవ్వగలరు. తద్వారా మనం అనేకులచే గుర్తించబడతాం. లోకంలో మహిమ పర్చబడతాం. అది దేవుడిచ్చు ఉచిత కృప. అందువల్ల మీరు అవకాశమున్నపుడల్లా ఇతరులకు ప్రభువును గూర్చి తెలియజేయండి. మనల్ని అందర్లో ఆయన చిత్త ప్రకారం ఆయనే మహిమపరుస్తారు. ఇది నా జీవితంలో జరిగిన, జరుగుతున్న సంఘటనలకు నిదర్శనం.**
**★ అతడు ఒంటరియైయుండగా నేను అతని పిలిచితిని, అతనిని ఆశీర్వదించి అతనిని పెక్కుమందియగునట్లు చేసితిని.**

ప్రశ్న : సువార్త ప్రకటించకపోయినట్లయితే ఏమైనా ప్రాబ్లమా?
**జవాబు : అయ్యో...సువార్త ప్రకటించకపోయినట్లైతే నాకు శ్రమ అన్న పౌలు గారి మాట విన్న ప్రతి క్రైస్తవులపై సువార్త భారం మోపబడింది. అందుకని అందరూ సువార్త ప్రకటించాలి. అది దేవుడు భూమ్మీద మనకిచ్చిన ఏకైక పని. సువార్త అనేది పాస్టర్లే ప్రకటించాలని, అందులో మనం ధనం రూపాన పాలిభాగస్తులయితే సరిపోతుందని అనుకుంటే ముమ్మాటికి తప్పే. దేవుడు మన దగ్గరనుండి ధనం కోరుట లేదు. మన ద్వారా ఒక పాపి రక్షింపబడాలని కోరుతున్నాడు. అలా చేస్తే ఆయన పరలోకంలో తన దూతలతో ఆనందిస్తానన్నారు. దేవునికి గల ఆ ఒక్క కోరిక తీర్చుట మన బాధ్యత. బైబిల్లో సువార్తను గూర్చి మాత్రమే.... చేయకపోతే శ్రమని వ్రాయబడిందాన్ని గమనించాలని మరోసారి తెలియజేస్తున్నా. అందువల్ల నీవైనా, నేనైనా, మరెవరైనా సువార్త చేయాల్సిందే. సాటి క్రైస్తవులకు క్రీస్తును గూర్చి చెప్పుట సువార్తకాదని గుర్తుంచుకోండి. క్రీస్తు నెరగని వారెవరికైనా క్రీస్తును గూర్చి తెలియజెప్పుటే సువార్త. ఇది గుర్తుంచుకోదగినది, గమనించదగినది. జాగ్రత్తసుమా!**



## నేనే సంఘమందుండి దేవుని ఆరాధించాలి?

గత సంచిక తరువాయి.....

ఆ విధముగా కాక మేము పౌలు వారము, అపొల్లో వారము, లేదా లూథర్ వారము, బాప్టిస్టు వారమని మనము పిలువబడినయెడల శరీర సంబంధులైన వారమేగాని ఆత్మ సంబంధమైన వారముగా ఉండనేరము (1కొరింధి3:4-11).

క్రీస్తు సంఘము "దేవుని నిత్య సంకల్పము" దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసు నందు చేసిన నిత్య సంకల్పము చొప్పున క్రీస్తు సంఘము ద్వారా తనయొక్క నానా విధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించెను (ఎఫెసీ 3:8-11) "ఈ మర్మము గొప్పది: అయితే నేను క్రీస్తునుగూర్చియు సంఘమునుగూర్చియు చెప్పుచున్నాను" (ఎఫెసీ 5:32). అని పౌలు చెప్పుచున్నాడు. ఏ సంఘమైన ఒక్కటే అనుట, ఏ దేవుడైన ఒక్కటే అనుట ఏ బాప్తిస్మమైనను ఒక్కటే అనుట మనుష్యులను సులభముగా చిక్కులు పెట్టు పాపము. బైబిలు చెప్పునదేమనగా "సంఘము (శరీరము) ఒక్కటే, ప్రభువు ఒక్కడే, బాప్తిస్మము ఒక్కటే ..." (ఎఫెసీ 4:4-6). సంఘమును యేసు క్రీస్తు వారు కట్టెను. అందుచేతనే అది క్రీస్తు సంఘమైనది. యేసు బాప్తిస్మము (ముంచుట) పొంది నీతియావత్తు ఈలాగున జరుగవలెనని చెప్పెను (మత్తయి 3:15). అందుచేత బాప్తిస్మము పొందినవారిని ప్రభువు తన సంఘమునకు మాత్రమే చేర్చుచుండెను (అపో॥ కా॥ 2:47). బాప్తిస్మము పొందినవారు ఏ ఇతర సంఘమునకు చేర్చబడినట్లు దైవగ్రంథమందు ఎచ్చటను వ్రాయబడలేదు. శాశ్వతము నిలిచే దేవునివాక్యము ను మనము పూర్ణహృదయంతో నమ్మినయెడల నిశ్చయముగా క్రీస్తు సంఘము నందుండిమాత్రమే దేవునిని మహిమపర్చవలెను (ఎఫెసీ3:20,21).

ఒక పురుషుని వివాహము చేసుకొనిన స్త్రీ మరొక పురుషుని పేరు పెట్టుకొనదు. పెండ్లి కుమారుని ఇంటి పేరు ధరించుట పరిపాటి. దానికి కారణమేమంటే - స్త్రీ కి శిరస్సు పురుషుడు. అటువలెనే సంఘమునకు శిరస్సు క్రీస్తు కనుక, క్రీస్తుకి విధేయత, నమ్మకము కనబరచు ప్రతి వ్యక్తి క్రీస్తు స్థాపించిన తన సంఘమైన క్రీస్తు సంఘ సభ్యుడుగా మాత్రమే ఉండగలడు. (ఎఫెసీ5:23). సర్వలోక రక్షణార్థమై ప్రభువు ఒక్కసారే కట్టిన సంఘము కొరకు ప్రయాసపడవలసి యున్నది. పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధనిమిత్తము మనము పోరాడవలసియున్నది (యూదా 3).

అనేక మతశాఖలుగా విడిపోయి ఒకరినొకరు విమర్శించుకొనే ఈదినములలో ప్రభువు చెప్పినట్లు "మంద ఒక్కటియు - కాపరి ఒక్కడును కావలెనంటే" మన మందరము మానవులు నిర్మించిన సంఘములను వాటి సిద్ధాంతాలను విడిచి, సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు నిర్మించిన క్రీస్తు సంఘసభ్యులమై ఆయనను మహిమపర్చుట నేటి మన విధి. అదియే దేవుని చిత్తము. అప్పుడు మాత్రమే ప్రభువు, అపొస్తలుల సెలవిచ్చియున్నట్లు ఏకాత్మతోను, ఏకాభిప్రాయముతోను ఆయనను సేవించుట సాధ్యమగును. అపొస్తలుల బోధలోను సహవాసములోను సాగిపోవుట సాధ్యమగును (అపో॥ కా॥ 2:42) అయితే సంఘమునకు ఏ పేరు పెట్టినా ఫర్వాలేదు పేరులో ఏముందిలే అని బేధములు పుట్టించి, సత్యము (వాక్యము) నకు లోబడక దుర్నీతికి లోబడు వారి మీదికి దేవుని ఉగ్రతయు, రౌద్రమును వచ్చును (రోమా 2:8). మత బేధములు కలిగించు మనుష్యునికి ఒకటి రెండు మారులు బుద్ధిచెప్పిన తరువాత వానిని విసర్జించుము (తీతు 3:10).

ప్రియ చదువరి! నీవు ఎవరి సంఘమునకు చెందినవాడవు? క్రీస్తు తన రక్తమిచ్చి సంపాదించిన క్రీస్తు సంఘ సభ్యుడువా? లేక మానవుడు తన స్వార్థముకొరకు నిర్మించుకొన్న ఏదో ఒక సంఘమునకు చెందినవాడవా? నీ కొరకు శిలువలో బలియై నీకు రక్షణ ఇచ్చుటకు రక్తమును చింధించిన యేసు క్రీస్తు పై లక్ష్యముంచి ఆయన నిర్మించిన క్రీస్తు సంఘములో చేరి నిన్ను నీవురక్షించుకొనుమని దేవుని పేరిట వేడుకొనుచున్నాను. ఇంకా వివరముగా దేవుని నిత్య సంకల్పమును తెలునుకొనుటకు మీ దగ్గరలోని క్రీస్తు సంఘమలను దర్శించండి, లేదా మమ్ము సంప్రదించండి.



**క్రీస్తు సంఘము**
**స్టీఫెన్ యం. సుందర్,**
సువార్తికులు

*(అయిపోయింది)*

మీ చేతిలో ఉన్న క్రైస్తవనాడు పేపరు ఆసాంతం మీరు చదివారా? మీకు నచ్చిన అంశాన్ని ఫోన్, ఎస్.ఎమ్.ఎస్., ఉత్తరం... ఏదో ఒక రూపంలో తెలియజేయండి. అలాగే మునుపటి పేపర్లలో ఇంకా మీకు నచ్చిన అంశాలు ఉండొచ్చు అన్న నమ్మకం కలిగి వాటిని చదవాలనిపిస్తే..... మీ ఇంటికి పంపేందుకు మేం సిద్ధం. సంప్రదించండి, సహకరించండి, దేవుని (వాక్యం) లో బలపడండి.

**వధువు కావలెను**

**క్రైస్తవ విశ్వాసంలో బలపడుతున్న ఛామనచాయ పద్మశాలి అబ్బాయికి క్రైస్తవ లేక విశ్వాసమార్గానికి కొత్తగా వచ్చిన వారైనా పర్వాలేదు.**

వరుని వివరాలు : వయసు: 28 సంవత్సరాలు; ఎత్తు : 5'6"; చదువు : బి.కామ్; ఉద్యోగం : ప్రైవేట్ జాబ్; గాజువాక (విశాఖ)లో రెండంతస్తుల సొంతిల్లు. వరుని అన్నయ్యకు వివాహమైంది. తమ్మునికి వివాహం కాలేదు. తండ్రి ఎ.యు. ఉద్యోగి రిటైరయ్యారు. తల్లి హౌస్‌వైఫ్

*ఆసక్తి గలవారు సంప్రదించగలరు:*

**ఫోన్స్: 9849724094 (వరుని తండ్రిది); 9966816731(వరునిది)**

"క్రైస్తవనాడు" మీకు రెగ్యులర్‌గా రావట్లేదా!? అయితే వెంటనే మాకు తెలియజేయండి

**మీరింకా చందాలు కట్టలేదా? వెంటనే పంపి సహకరించండి**

**చందాలు కట్టిన వారికే క్రమంగా పంపబడుతుంది, పాఠకులిది గమనించాలి.**

ప్రార్థించండి **కావలెను** బలపర్చండి

ప్రతిజిల్లాలో క్రైస్తవనాడు ఉపకార్యాలయాలను ప్రారంభించాలనుకుంటున్నాం. కార్యాలయ నిర్వాహణ, జిల్లాలో గల ముఖ్య సంగతుల సేకరణ మరియు సంఘాలలో జరిగే కార్యక్రమాల వివరాలు సేకరించుట యందు ఆసక్తి గల వారు సంప్రదించండి.

పాలివారవండి ఫోన్స్ : 9490266640, 9346960601 సహకరించండి

**క్రైస్తవనాడు 4వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక మనందరికి ఆధ్యాత్మిక మేలులు కల్గించు రచనలతో రావాలని ప్రార్థించుడి! -ఎడిటర్**


కొత్త శీర్షిక

బైబిలుపై అనేకులకున్న ప్రతీ సందేహం పటాపంచలుగావించే....

ధుర్బోధకులకు చెక్ పెట్టే...?!

# "దేవుని జ్ఞానము చెప్పినదేమనగా"

## శ్రమదినాలా?! 2



మునుపటి సంచికలో ఇవ్వబడిన వివరణ బాగుందని అనేకులు ప్రశంసించారు. అందును బట్టి దేవునికి స్తోత్రం. అయితే... మూసబోధకులు వాటిని జీర్ణించుకోలేక పోతున్నారని వింటున్నాం. అట్టి వాటిని క్రైస్తవనాడు పెద్దగా పట్టించుకోదు. పారంపర్యాచారములను బట్టి బోధించు బోధకులెవరైనా జీతగాళ్ళే! ఎందుకంటే మునుపటి బోధనలు తప్పని తెల్సినా ఖండించలేరు. యథార్థంగా బోధించలేరు. వారికట్టి స్వాతంత్ర్యం సంఘాల్లోనుండదు. అట్టి బోధకులను గొప్పవారిగా తలచి వారి బోధనలే నిత్యసత్యాలని భ్రమించు సేవకులు స్వతంత్ర సంఘాల్లోనూ కన్పడతారు. వీరూ మారరు. ఎందుకంటే అట్టివారి ప్రాపకం కోసం ప్రాకులాడుతారు కాబట్టి. బోధన్నది ఎప్పుడూ పారంపర్యాచారములను బట్టి ఉండరాదు. లేఖనములను చదువుతూ గ్రహిస్తున్న వారికే అందలి విషయపరిజ్ఞానం అర్థమవగలదు. అందుకు పరిశుద్ధాత్ముని సహాయం ఎల్లప్పుడు మనకు తోడై ఉంటుంది. అది మరిచి అతడో గొప్ప బోధకుడు అతగాడు చెప్పిందే కరెక్టు అనుకుంటూ గుడ్డిగా అట్టివారిని అనుసరించువారికి పరిశుద్ధాత్మ సహాయం లభించదు! ఎందుకంటే వీరి హృదయం నిండుగా గొప్పబోధకులనుకున్నవారు, వారిబోధలే నిండి ఉంటాయి కాబట్టి. క్రీస్తును ఆచార వ్యవహారాదులతో ఆచరించేందుకు ఆయన ఆచారాలను ప్రకటించలేదు. దేవుని వాక్యం ప్రకటించారు. తన జీవితంలో వాక్యాచరణను సంపూర్తిగా లోకానికి చూపారు. అందువల్ల ఎవరెటువంటి బోధలు బోధించినా వారినిబట్టి ఆ వివరణ నిజమనుకొని గుడ్డిగా నమ్మక, లేఖనాల్లో అవెంతవరకు నిజం అన్నది మనం పరిశోధించాలి. వారి బోధలు లేఖనానుకూలమైతే వాటిని నేర్చుకొని మన జీవితాలను మలచుకోవాల్సిందే. అయినా వారి బోధనలో ఇంకేమైనా ప్రశ్నగా మిగిలుంటే మరి కొందరిని అడిగి తెల్సుకొనుట విజ్ఞుల లక్షణం. అలా అలా మనందరం కడవరకు లేఖనాల్లో పరిపూర్ణులగుటకు శ్రమించాల్సిందే. అపుడే తండ్రియైన దేవునిని, కుమారులైన యేసుక్రీస్తుని ఎరుగగలం. వారిని ఎరుగుతున్నకొలదీ ఆశీర్వాదాలు వాటంతటవే మనకున్న అవసరతలను బట్టి మనదగ్గరకు వస్తాయి. అపొస్తలులకు ఆలాగుననే వచ్చాయని తద్వారా వారు బలమైన పరిచర్య చేసినట్లు బైబిల్లో చదువగలుగుతున్నాం. శ్రమదినాలపై మరికొంత వివరణను ఉపమానాలతో ఇస్తున్నాం! చదవండి.

ఉపమానం : నేనే మునుపటి దినాల్లో ఓ 40 రోజులు ఆసుపత్రిలో ఉన్నాననుకోండి. తర్వాత 41 రోజు డిశ్చార్జియ్యాననుకోండి. ఆ దినం నాకు, మా ఇంటివారికి ఎంతో సంతోషాన్నిస్తుంది. ఊరంతా మా సంతోషాన్ని పంచుకొంటాం. అక్కడితో అది సరి. మరలా అట్టి స్థితిలో ఎవరైనా ఎదురైనా, అటువంటి సందర్భాలొచ్చినపుడైనా ఆయాబాధాకరమైన దినాల్ని గూర్చి... మేమూ అట్టిదినాల్ని చూశాం గాని నేడు ఆరోగ్యంగా ఆనందంగా ఉన్నామనే చెబుతాం. ప్రస్తుత పరిస్థితిని బట్టే సంతోషిస్తూ వారికి కన్పరుస్తుంటాం. అంతేగాని ఆ బాధాకర దినాల్ని ఇప్పటి జీవితంలో వారికి ఆచరణలో చూపలేం. మనమూ బాధలు అనుభవించామని చెప్పగలమే గాని ఆ విచార ఛాయలు మనలో ఇంకా చూపుట అసాధ్యం. అలాగే మనింట్లో ఎవరైనా మరణించారనుకోండి బాధలో ఉంటాం. అదేవ్యక్తి తిరిగి జీవిస్తే మన సంతోషాన్ని పట్టలేం. లోకంలో ఇలా అప్పుడప్పుడు జరుగుతున్నట్లు వింటుంటాం. అప్పటినుండి చనిపోయి బ్రతికిన వ్యక్తిని గూర్చి చనిపోయి బ్రతికాడండీ అనే లోకానికి సంతోషంగా చెబుతాం. మనకి ఆ వ్యక్తి చావును చనిపోకముందు ఆ వ్యక్తి పడిన బాధను బలంగా ప్రకటించాలని అన్పించదు. ప్రకటించలేం కూడా! మరణాన్ని జయించాడండి. మృత్యుంజయుడండి అని మహానందంతో అందిరితోను ఆ సంతోషాన్ని పంచుకుంటాం. ఆవ్యక్తి చనిపోయినప్పటి వేదన కలకాలం గుర్తుచేసుకొంటుంటామా? లేక బ్రతికిన క్షణాలను గుర్తుచేసుకుంటామా? ఆలోచించాలి. అలాగే మనం కూడా పునరుత్థానుడైన యేసుక్రీస్తునే ప్రకటించాలి. పునరుత్థానమన్నది చరిత్రలో ఇప్పటి వరకు యేసు తప్పమరెవరూ ఎవరూ చేయనిది, చేయలేనిది. కాబట్టి మనం యేసును ప్రకటించుట భాగ్యంగా భావించాలి. యేసు మరణానికి ముందు పడిన శ్రమలు లోకరక్షణకొరకు అన్న విషయం మనం బయల్పరచాలి. ఆయా శ్రమలను, వాటి పరమార్థాన్ని వివరించగలగాలే గాని వాటిని మనం ఆచరించేందుకు ఆసక్తి కనబర్చరాదు. ఎందుకంటే అట్టి శ్రమలు మనకొస్తే భరించగలమా? ఆలోచించండి. ఆయనతో తిరిగిన శిష్యులే శ్రమలొస్తే చెదిరిపోయిరని బైబిల్లో చూడగలం! మనమేపాటివారము? ఆలోచించాలి. ఈ విషయంలో యేసుప్రభువే చెప్పిన ఉపమానం. మరింత అవగాహన కలిగేందుకు ఇస్తున్నాను చదవండి.....

**★ కొంచెము కాలమైన తరువాత మీరు నన్ను చూడరు, మరి కొంచెము కాలమునకు నన్ను చూచెదరని నేను చెప్పిన మాటను గూర్చి మీరు ఒకనితో ఒకడు ఆలోచించుకొనుచున్నారా? మీరు ఏడ్చి ప్రలాపింతురుగాని లోకము సంతోషించును; మీరు దు:ఖింతురు గాని మీ దు:ఖము సంతోషమగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను." స్త్రీ ప్రసవించునప్పుడు ఆమె గడియవచ్చెను గనుక ఆమె వేదనపడును; అయాతే శిశువు పుట్టగానే లోకమందు నరుడొకడు పుట్టెనను సంతోషము చేత ఆమె ఆ ప్రసవవేదన మరి జ్ఞాపకము చేసికొనదు"**

పై లేఖన భాగం ఆసాంతం చదివి గ్రహించారనే నమ్ముతున్నాను. సంతోషముచేత వేదనను మరలా జ్ఞాపకం చేసికొనరని యేసే చెప్పారు. కాబట్టి మునుపటి నుండి అచారాలు ఇలా సాగుతున్నాయి దాని వాటినే గ్రుడ్డిగా ఆచరించుట "క్రైస్తవులకు తగదు". దేవుని విషయాలు బయల్పడుతున్నప్పుడు వాటిని అనుసరించుటే మేలు. తర్వాత వచనంలోనే యేసు ఏమన్నారో కూడా చదవండి....

**★ అటువలే మీరును ఇప్పుడు దు:ఖపడుచున్నారు గాని మిమ్మును మరల చూచెదను, అప్పుడు మీ హృదయము సంతోషంచును, మీ సంతోషమును ఎవడును మీ యొద్దనుండి తీసివేయడు.**

స్త్రీ ప్రసవేదనను గూర్చి చెప్పిన వెంటనే ఈ వచనాన్ని ప్రభువెందుకు పలికారో చదివి గ్రహించాలని మిమ్మల్ని కోరుతున్నాను. మన సంతోషాన్ని 'ఎవడును' మన యొద్ద నుండి తీసివేయడన్న భరోసా యేసుక్రీస్తు వారికుందిగాని మీలో ఎందరికుంది? ఆలోచించండి. మనందరికి అట్టి సంతోషముండాలనే యేసుకోరిక. అది ఆయన మనకు ఉచితంగా అనుగ్రహించిన కృప. అట్టి సంతోషాన్ని మనం అందరికీ ప్రకటింపబద్ధులం. ఆ సంతోషమే మనలో ఇతరులు చూడాలి. యేసు నొద్దకు వారూ రావాలి. ఆ సంతోషమే మన హృదయాల్లో పరిపూర్ణం చేసుకొనుటకు ఇష్టపడాలి. అపుడు మనం యేసుక్రీస్తు పేరిట తండ్రియైన దేవునిని ఏమడిగినను ఇస్తారని బైబిలు ధైర్యమిస్తుంది.

★ మీ సంతోషము పరిపూర్ణమగునట్లు అడుగుడి, మీకు దొరుకును.

లేఖనాలయందు బలపడుతూ ప్రతిదినం మన బ్రతుకును యేసు క్రీస్తులో ఫలించుకొవాలి, అందుకోసం ప్రార్థించాలి. మన ప్రభువైన యేసుక్రీస్తువారు మనందరకూ అట్టి జీవితాన్ని ప్రసాదించును గాక! ఆమెన్. - వైకెయార్.

ఆశ్చర్యకర సంగతులు! నేడే మీ కాపీని రిజర్వ్ చేసుకోండి ఆధ్యాత్మిక మేలుకై!!

## క్రైస్తవనాడు 4 వ, వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

త్వరలో.....

తండ్రియైన దేవుని ప్రేమతో, కుమారుడును మన ప్రభువైన యేసుక్రీస్తు కృపలో, పరిశుద్ధాత్ముని అన్యోన్య సహవాసంతో మరియు మీ అందరి సహకారంతో క్రైస్తవనాడు ఆధ్యాత్మిక సామాజిక పక్షపత్రిక 4 సంవత్సరంలోకి ప్రవేశిస్తుంది. అందుకు దేవునికి స్తోత్రం. 4వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికలో మీ రచనలు, పరిచర్యల వివరాలు, సాక్ష్యాలు, భవిష్యత్ కార్యక్రమాలు, ఇంకా అనేకరకాల ప్రకటనలు ప్రచురించుకొను అవకాశం మీకుంది. తద్వారా మనం ఒకరికొకరం క్షేమాభివృద్ధి కల్గించుకొంటూ ప్రభువును మరింత మహిమ పర్చగలం. 4వ, వార్షికోత్సవ ప్రత్యేక సంచికలో అనేక ఆశ్చర్యకర సంగతులను చూడగలరు. సేవలో పడిపోయినవారు, పడిపోతున్న వారిని బలపర్చే అంశాలుంటాయి. మీ పుస్తకభాండాగారంలో ఈ సంచిక ఓ ప్రత్యేకతను చాటుకొంటుందనుట నేను మీకిస్తున్న భరోసా! మీ వివరాలు ఇప్పుడే పంపండి. పత్రికలో తగు స్థలాన్ని కేటాయించుకోండి. లేదా మాకు ఫోన్ చేసి మీ వివరాలు చెప్పండి చాలు. ఇక మీదే ఆలస్యం.

3-178, 5వ లైను, ఆదర్శనగర్, విశాఖ-40
ఫోన్ : 9346960601, 9490266640

గమనిక: ప్రత్యేక సంచికను చూసి పాలిభాగస్తులు కాని వారు మేమీ పత్రికలో పాలివారమవలేకపోయామే అని కించిత్ బాధపడుట ఖాయం. అలా బాధపడే అవసరం మీకు రాకుండేట్లు మీ వివరాలు పంపి మీరూ పాలివారవాలని మా కోరిక. అది మాకెంతో సంతోషాన్నిస్తుంది.

'మాకొరకు ప్రార్థించుడి'
క్రీస్తునందు మీ సహోదరుడు వై.కనకరాజు


ప్రభువునందు నిద్రించిన

## ఫాదర్ ఫెర్రర్

అనంతపురం పరిసర ప్రాంతాలయందు ప్రభుని సేవలతో అనేకులను ఆదరించిన ఫాదర్ ఫెర్రర్ ప్రభువు నందు నిద్రించిరి. సేవల ద్వారా ఆయన లక్షలాది ప్రజాహృదయాలను దోచుకున్నారు. ఆయన సమాధి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రమంత్రే ఆయన్ని గూర్చి చెబుతూ... పాదర్ ఫెర్రర్ సేవల ద్వారా ఓ ప్రభుత్వాన్నే నడిపారన్నారు. ప్రభుత్వం కూడా ఆయనలా చేయలేదని ఆయన్ని శ్లాఘించారు. ప్రతి మీడియాలో ఆయన గురించి వచ్చిందంటే ఆయనెంతగా ప్రభావితం చేసారో ఆలోచించాల్సిందే. ఆ సేవలను నేటి క్రీస్తు సేవకులు గ్రహించి అనుసరిచాల్సిందే. ప్రభుత్వ లాంఛనాలతో సమాధి కార్యక్రమం జరిగించుకున్న తొలి ఫాదర్ ఈయనే. అటు ప్రభుత్వం ఇటు ప్రజలు వేనోళ్ల కొనియాడదగిన సేవలు చేసి ప్రభువైన యేసుక్రీస్తును మహిమ పర్చిన ఫాదర్ ఫెర్రర్ జీవితం ఎందరికో మాదిరి! కార్యక్రమంలో స్పెయిన్ దేశస్థులు పాల్గొని ఫాదర్ ఫెర్రర్‌ను కొనియాడారు. క్రైస్తవనాడు ఆయన్నెరుగకపోయినా... విన్నదాన్ని, కన్నదాన్ని బట్టి ఆయనకు అర్పిస్తుంది నమస్సుమాంజలి. అట్టి వారి సేవా పరిచర్యలే అందరికి ఆదర్శం కావాలి.

62వ వార్షికోత్సవం జరుపుకున్న

## డేవిడ్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి



డేవిడ్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి (ఇన్‌సెట్లో బొచ్చ మనోహర్ కుమార్)

నాగులాపల్లి (అనకాపల్లి) : డేవిడ్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి 62వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. సంఘం అడ్వయిజర్ బొచ్చ మనోహర కుమార్ దంపతులు పాల్గొన్నారు. అనకాపల్లి బాప్టిస్ట్ సంఘ కాపరి రెవ. జాకబ్‌రాజు ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేసారు. సంఘస్తులు, పరిసర ప్రాంతీయులు నాటి ఆరాధనలో పాల్గొన్నారు. సంఘపెద్దలు సంఘ ఆవిష్కరణ నుండి నేటివరకు గల సంగతులను గుర్తుచేసారు. సంఘ బాగోగులు చూచుటలో బొచ్చ మనోహర కుమార్ కుటుంబస్థులు అన్ని విధాల సహకరిస్తారని ఆ ప్రాంతీయులు చెప్తున్నారు. నాటి ఆరాధనలో క్రైస్తవనాడు ఎడిటర్ పాల్గొని గ్రీటింగ్స్ అందించారు. మరుసటి ఆదివారం నాడు ప్రసంగించుటకు ఎడిటర్ వై.కె.రాజు ఆహ్వానించబడి బోధించారు. స్థానిక సంఘ కాపరి ఆనందవరం ప్రార్థనలో నడిపారు.



పదవ తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థినిలు సంతోషి, కుమారీలకు చెరో వెయ్యి రూపాయలు ప్రోత్సాహక బహుమతిగా అందిస్తున్న బొచ్చ మనోహర కుమార్ సతీమణి


RNI APTEL/2006/17980



ప్రపంచ మారుమనస్సు రక్షణ మరియు స్వస్థత కొరకు

# ప్రపంచ ప్రార్థనాదినం

## ఆర్కేబీచ్



స్టేట్ కో-ఆర్డినేటర్ రెవ. డా. ఎం.ఎ.పాల్ ఆధ్వర్యంలో విశాఖ ఆర్కేబీచ్‌లో ప్రపంచప్రార్థనా దినం ఘనంగా జరిగింది. స్థానిక నాయకులందరు పాల్గొని కార్యక్రమానికి నిండుదనాన్ని తెచ్చారు. అనేక అంశాలను గూర్చి ప్రార్థించారు. ఒక్కొక్కరు ఒక్కో అంశాన్ని తీసుకొని ప్రార్థించారు. కార్యక్రమాన్ని రెవ. నక్కా కృపారావు, రెవ. ఆనందరావు తదితరులు నడిపారు. ప్రముఖ క్రైస్తవ నాయకులు బ్రదర్ కోట సుబ్బారెడ్డి ప్రార్థనలో పాలుపంచుకున్నారు. క్రైస్తవ ప్రోగ్రాంలకు ఆయన సహాయకులుగా ఉంటూ సేవకు బహుగా సహకరిస్తారని ఆయనను గూర్చి అనేక కాపర్లు చెబుతుంటారు. ఆయన కుటుంబం సేవలో ఎందరికో ఆదరణగా ఉంటుందన్న సాక్ష్యాలు ఫెలోషిప్పుల్లో బలంగా విన్పడుతుంటాయి. వేదికపై ప్రార్థనల్లో పాల్గొన్నవారిలో పాస్టర్ పరమానందం ఉన్నారు. ఆయన, ఆయన కుమారులు కూడా సేవలో బలంగా వాడబడుతున్నావారేనని తాటిచెట్ల పాలెం పరిసర ప్రాంతీయులు చెబుతుంటారు.

ఆర్కేబీచ్ ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు (ఇన్‌సెట్లో బ్రదర్ కోట సుబ్బారెడ్డి)



*లోకోక్తులు :* ❊ సద్వచనాలు విని ప్రయోజనంలేదు. వాటిని ఎంతవరకు ఆచరణలోకి తెస్తున్నామనేదే ముఖ్యం - స్వామి వివేకానంద.

❊ ఈ ప్రపంచంలో మంచి ఆలోచన అన్నింటినీ మించిన ప్రయోజనాలందించే కార్యశక్తి.

## గాజువాక

మే 31న జరగాల్సిన ప్రపంచప్రార్థన దినం జూన్ 7న జరిపారు. మే 31న గాజువాకలో మన్నా సభలు జరిగే వేదికపైనే ప్రార్థనాదినం జరపాలని తొలుత నిర్ణయించారు. ఆనాడు ప్రాంతంలో వర్షం విపరీతంగా కురిసింది. అందువల్ల ప్రార్థనాదినం జరుపలేకపోయారు. మరుసటి ఆదివారం అనగా జూన్ 7న స్థానిక గుడ్ షెపర్డ్ చర్చిలో జరిపారు. నాటి కార్యక్రమానికి నిర్వాహకులైన పాస్టర్లు ఎ. రవిబాబు, ఎస్.రవిలు అందిరిని సమీకరించారు. డా. జగదీశ్‌ప్రసాద్, గాజువాక పాస్టర్స్‌ఫెలోషిప్ అధ్యక్షులు ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారని తెలిపారు.






## ఆరిలోవ




ఆరిలోవలో పాస్టర్ల ఫెలోషిప్పులు రెండున్నా యంటున్నారు. కొన్ని విభేదాలున్ననూ ప్రార్థనాదినం నడుపుటలో మొత్తానికి ఏకీభవించినట్లే తెలుస్తోంది.పాస్టర్ శ్యామ్ కార్యక్రమాన్ని ఆద్యంతం నడిపించారు. వాక్యోపదేశానికి పాస్టర్ మెల్కిసెదెక్ వచ్చారు. విశాఖలో ప్రార్థనాదినం జరిగే ప్రాంతాలన్నిటికి రెవ. డా. ఎం.ఎ.పాల్ ఓ సారి దర్శిస్తూ బలపర్చారు. ఆ ఒరవడిలోనే ఆయన ఆరిలోవ ప్రార్థనలో పాల్గొని గ్రీటింగ్స్ అందించారు. ప్రార్థనతో కూడిన సువార్త ఎంతో విలువైనదని చెప్పారు. క్రైస్తవజీవితానికి ముఖ్యమైనది సువార్త మరియు ప్రార్థనేనని చెప్పారు. సువార్త ద్వారా వెళ్లిన ప్రాంతాన్నే దర్శించగలమన్నారు. ప్రార్థన ద్వారా ప్రపంచాన్ని, దేవుని పరలోకాన్ని దర్శించగలమని రెవ. డా. ఎం. ఎ.పాల్ తన గ్రీటింగ్స్‌లో తెలిపారు. పాస్టర్ మెల్కిసెదెక్ తన ప్రసంగంలో యేసు "లోకముకొరకు ప్రార్థన చేయుట లేదన్న" వాక్యాన్ని తీసుకొని బోధించారు. యేసు తండ్రియైన దేవునితో ఏకమై ఉన్నట్లు, తనతో ఉన్న శిష్యులు ఐక్యత కలిగుండాలని ప్రార్థించారని గుర్తుచేసారు. యేసుతో ఐక్యత కల్గిన శిష్యుల ప్రవర్తనను చూసి లోకము యేసు దగ్గరకొస్తారని తద్వారా తండ్రి ప్రేమను పొందగలరని ఉద్ఘాటించారు. అలాగే నిత్య జీవమంటే తండ్రిని, కుమారుడైన క్రీస్తుని ఎరుగుటయేనని చెప్పారు. లోకంకొకు ప్రార్థనే ప్రపంచప్రార్థనాదినంగా అందరూ భావిస్తూ ఆచరిస్తున్నారు. అందుకు విరుద్ధంగా యేసు లోకంకొరకు ప్రార్థన చేయుట లేదని చెప్పిన పాస్టర్ మెల్కిసెదెక్ బోధ అందరినీ ఆలోచింపజేసింది. అనేకులను సంకటస్థితిలో పడేసిందని కూడిన కాపర్ల చర్చలను బట్టి భావించాల్సి వస్తోంది. ఈకార్యక్రమం పాస్టర్ రత్నరాజు, పాస్టర్‌జె.స్టీవెన్ తదితరుల పర్యవేక్షణలో జరిగింది. ఆరిలోవలో ఒక ఫెలోషిప్పు నాయకుడైన పాస్టర్ జార్జిబాబు పాల్గొనకపోవుట చర్చనీయాంశమైంది. ఆలోటు స్పష్టంగా కన్పడిందని కొందరు కాపర్లు చెప్పుకున్నారు.



★ కృతజ్ఞతాస్తుతులతో నేనాయనను ఘనపరచెదను

Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 3-178, 5th Lane, Adarsh Nagar, Visakhapatnam - 530 040, Andhra Pradesh.
Ph : 9346960601,9490266640. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at Vinay Offset Printers, Premasamajam Road, Dabagardens, Visakhapatnam - 20